
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY



నల్లగొండ
5
మంగళవారం 24 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 20.0

అవగాహనే అస్త్రం

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం

మిర్యాలగూడకు చెందిన ఓ వినియోగదారుడు ఒక ప్రముఖ కంపెనీ నుంచి ఎక్స్‌కవేటర్‌ను కొనుగోలు చేశాడు. దాన్ని కొనుగోలు చేసిన నాలుగు నెలలకే సదరు వాహనం మరమ్మతులకు గురైంది. సాధారణ మరమ్మతుగా భావించి కంపెనీ షోరూమ్‌కు తీసుకెళ్లాడు. దానికి మరమ్మతులు నిర్వహించినా, తరచూ అదే సమస్య తలెత్తుతుండడంతో తయారీలోపాన్ని గుర్తించాడు. సదరు కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2018లో ఫిర్యాదు చేయగా,ఆ ఫిర్యాదు సబబైనదిగా నిర్ధారించిన కమిషన్ అతడికి రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని 2019లో సదరు కంపెనీని ఆదేశించింది. అయితే సదరు కంపెనీ రాష్ట్ర కమిషన్‌లో అప్పీల్ చేయగా, తాజాగా రెండుమాసాల క్రితం రాష్ట్ర కమిషన్ సైతం జిల్లా కమిషన్ తీర్పునే అమలుచేయాలని, బాధితుడికి రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని సూచించింది.



- నాణ్యమైన వస్తువులు, సేవలు పొందడం వినియోగదారుల హక్కు
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు, వర్చువల్‌గా విచారణకూ అవకాశం
- వినియోగదారుడి ప్రాంతంలోనే ఫిర్యాదుకు వెసలుబాటు
- నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం

మనం నిత్యం ఏదైనా ఒక వస్తువును కొనుగోలు చేయడమో లేదా ఏదైనా సంస్థ నుంచి సేవలు పొందడమో చేస్తుంటాం. అయితే ఆ వస్తువు నాణ్యతలో గానీ, సేవల్లో లోపాలు గానీ ఉంటే వినియోగదారుడు నష్టపోకుండా ప్రభుత్వం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం-2019ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టంపై అంతగా అవగాహన లేక వినియోగిస్తున్న వినియోగదారులు కొందరే. ఇప్పటికైనా అవగాహన పెంపొందించుకుంటే నాణ్యమైన సరుకులు, లోపాల్లేని సేవలు పొందడమేగాక, జరిగిన నష్టానికి పరిహారం కూడా పొందవచ్చు.



- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- వివరాలు 7వ పేజీలో...

వినియోగదారుడు ఉండే ప్రాంతంలో ఫిర్యాదు చేయవచ్చు




వినియోగదారులు 2019కి ముందు ఏదైనా ఫిర్యాదు చేయాలంటే సంబంధిత వస్తువు ఉత్పత్తి చేసిన కంపెనీ ఎక్కడ రిజిస్టర్ అయితే ఆ జిల్లా పరిధిలోని కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉండేది. వినియోగదారుల సౌలభ్యం కోసం 2019 చట్టంలో ఈ నిబంధనను మార్చి, వినియోగదారులు ఏ కమిషన్ పరిధిలోకి వస్తే అక్కడే ఫిర్యాదు చేసేలా మార్పు చేశారు. దీంతో నష్టపోయిన వినియోగదారులు ఎలాంటి ప్రయాస లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. దైనందిన జీవితంలో వినియోగదారుడు ఎలాంటి నష్టానికి గురైనా, లేదా సరైన సేవలు పొందలేకపోయినా, అందుకు సంబంధిత ఉత్పత్తిదారులు, సర్వీస్ ప్రొవైడర్ల నుంచి పరిహారం పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదు చేయవచ్చు. విచారణకు సైతం వర్చువల్‌గానే హాజరై ఫిర్యాదులు, పత్రాలు సమర్పించవచ్చు. మారిన వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వారి హక్కుల పరిరక్షణకు కమిషన్లు స్పందిస్తాయి.

- వి.అపర్ణరెడ్డి, న్యాయవాది

రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత ప్రకటించిన రుణమాఫీ నిధులు ఇంకా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రుణమాఫీ కోసం రైతులు నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకా మాఫీ సొత్తు రాలేదని బ్యాంకర్లు సమాధానమిస్తుండటంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మోత్కూరు, నల్లగొండ)



నాలుగో విడత రుణమాఫీ ఏది?

- ప్రకటనలకే పరిమితం
- బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో 48,196 మంది అర్హులు
- మాఫీ కావాల్సిన మొత్తం రూ.508.47కోట్లు

పట్టాదారు రైతు పేరు, ఆధార్ నంబర్‌లో తప్పుగా ఉండటం, రేషన్‌కార్డు లేకపోవడం, ఒకే ఆధార్ నంబర్ ఇద్దరి పేరున ఉండటం లాంటి కారణాలతో పలువురు రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ నిలిచిపోయింది. అయితే వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు సదస్సులు నిర్వహించి, తప్పులు సవరించడంతో పాటు ఏవోలు రైతు కుటుంబాల ఫొటోలు తీసి ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారందరికీ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు గత నెల 29వ తేదీన ప్రకటించింది. రుణమాఫీ పొందనున్న అర్హులైన రైతుల జాబితాలను వ్యవసాయశాఖ కూడా విడుదల చేసింది. అందులోనూ కొందరి అర్హుల పేర్లు లేవు. ఇదిలా ఉంటే ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించి 25 రోజులు అవుతున్నా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ప్రస్తుతం యాసంగి వరినాట్ల సీజన్ ముమ్మరమైంది. దీంతో రైతులు దున్నకాలు, ఎరువులు వేయడం, నాట్లలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వారికి పెట్టుబడులకు డబ్బు అవసరం. ప్రభుత్వం రుణమాఫీ నిధులు జమ చేస్తే బ్యాంకు అప్పు తీరుతుంది. దీంతో రైతులు తిరిగి మళ్లీ రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. రైతులు భూ విస్తీర్ణాన్ని బట్టి ఎక్కువ రుణం కూడా తీసుకోవచ్చు. ప్రభుత్వ మాఫీతో అప్పు తీరితే కొత్తగా రుణం తీసుకుని వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించవచ్చని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గ్రామాల నుంచి రైతులు ప్రతి రోజూ మండల కేంద్రాల్లో ఉన్న బ్యాంకులకు వెళ్లి రుణమాఫీ నిధులు జమ అయ్యాయా? అని సిబ్బందిని ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నిధులు జమ చేయకపోవడం, రైతులు పదేపదే వచ్చి అడుగుతుండటంతో బ్యాంకు సిబ్బంది విసుక్కుంటున్నారు.

తప్పులు సవరించినా

ఉమ్మడి జిల్లాలో మూడు విడతల్లో రుణమాఫీకి నోచుకోని రైతుల తప్పులను వ్యవసాయశాఖ అధికారులు సవరించి

- మిగతా 6వ పేజీలో...

నాలుగో విడత రుణమాఫీ కాలేదు



నాకు అడ్డగూడూరు ఏపీజీవీబీలో రూ.52,900 పంట రుణం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో ప్రకటించిన రూ.లక్ష లోపు రుణమాఫీలో నాకు మాఫీ కాలేదు. దీంతో బ్యాంకుకు వెళ్లి విచారించగా నా ఆధార్ నంబర్ మరో రైతుకు రాశారు. దాన్ని సరిచేయించా. అయినా మూడు, నాలుగో విడతలోనూ నాకు రుణమాఫీ రాలేదు. మా గ్రామంలో ఆదాయం పన్ను చెల్లింపుదారులకు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా మాఫీ వచ్చింది. వ్యవసాయం చేసుకునే నాకు రాకపోవడం విచిత్రంగా ఉంది. ప్రభుత్వం నాకు రుణమాఫీ వర్తింపజేయాలి.

- నీలగిరి శ్రీనివాసులు, రైతు, లక్ష్మీదేవికాల్వ

ఇంకా మాఫీ కాలేదు

ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించినా నేటికీ మాఫీ కాలేదు. ప్రభుత్వం ప్రకటించి 25రోజులు దాటగా, రోజూ బ్యాంకు వద్దకు వెళ్లడం, వారు జమ కాలేదని చెప్పడం పరిపాటిగా మారింది. రుణమాఫీ ఆలస్యం అవుతుండడంతో కొత్త రుణాలు తీసుకోలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రుణమాఫీ నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.



- ఎస్‌కే.ఉస్మాన్, కాశివారిగూడెం,తిప్పర్తి మండలం

ఉమ్మడి జిల్లాలో 48,196 మంది

యాదాద్రి జిల్లాలో నాలుగో విడత 11,691 మంది రైతులకు రూ.111.65కోట్లు, నల్లగొండ జిల్లాలో 21,495 మంది రైతులకు రూ.236.85 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 15,010 మంది రైతులకు రూ.159.97కోట్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో మొత్తం 48,196 మంది రైతులకు రూ.508.47కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉంది. ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించి 25 రోజులైనా నేటికీ రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు. గత మూడు విడతల్లో యాదాద్రి జిల్లాలో 68,584 మంది రైతులకు రూ.553.82కోట్లు, సూర్యాపేట జిల్లాలో 1,12,259 మంది రైతులకు రూ.845.05కోట్లు, నల్లగొండ జిల్లాలో 2,12,486 మంది రైతులకు రూ.1,767.98 కోట్ల రుణమాఫీ జరిగింది. నల్లగొండ జిల్లాలో మొదటి విడతలో 1,05,197మంది రైతులకు రూ.579.14కోట్లు, రెండో విడతలో 63,014 మంది రైతులకు రూ.632.92కోట్లు, మూడో విడతలో 44,275మందికి రూ.555.92కోట్లు రుణమాఫీ జరిగింది. అయితే వెంటనే నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



● క్రిస్మస్‌కు ముస్తాబు

నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో విద్యుత్ దీపాల వెలుగులో తెలుగుబాప్టిస్ట్ చర్చి

జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చీలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలకంరించారు. క్రిస్మస్ ట్రీ, స్టార్ గుర్తులు ఏర్పాటుచేశారు. ఏసు రాక సందర్భంగా మంగళవారం ఉదయం నుంచే చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి కేక్ కట్‌చేసి ఏసు బోధనలను చర్చి ఫాదర్లు ప్రవచించనున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

7

వరి సాగు తీరు మారే

- యాంత్రీకరణపై రైతుల ఆసక్తి
- అందుబాటులోకి పలు యంత్రాలు
- సమగ్ర యాజమాన్యంపై దృష్టి
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

6



ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పలు ఇబ్బందులకు గురిచేస్తోందని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆరోపించారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై ఇంత వరకు ప్రధాని మోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రజల మనోభావాలను కించపరిచేలా వ్యవహరించిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే దేశంలో పాలన నడుస్తోందని, ఆయన రాజ్యాంగ రచనతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేడ్కర్ కృషి చేశాడన్నారు. ఆయన ఏ ఒక్క జాతికో, కులానికో నాయకుడు కాదని, అందరి వాడన్నారు. అటువంటి వ్యక్తిపై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం సంపత్‌రెడ్డి, కత్తుల కోటి, ఎండీ.ముంతాజ్, దుబ్బ అశోక్ సుందర్, జూలకంటి శ్రీనివాస్, కిన్నెర అంజి, వెంకన్న, జూలకంటి సైదిరెడ్డి, బోడ స్వామి, వజ్జ రమేష్, నాగరాజు, పి.రమేష్, కార్తీక్, ఆనంద్‌రెడ్డి, అంజయ్య, మహేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

నాంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా, కార్మికులకు, కర్షకులకు నిరంతరంగా అండగా ఉంటూ వారి కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రగిపని అంజాచారి, సుందనబోయిన రమేష్, ఊరుపక్క వెంకటయ్య, నేతాళ్ల రాజు, పల్లె సైదులు, కోరే సత్తయ్య, పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ బాలమాయాదేవి

నల్లగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, బీసీ వెల్ఫేర్ కమిషనర్ బి. బాలమాయాదేవి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి సోమవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై నిర్వహించే సమావేశాలన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. ఫొటో ఓటరు గుర్తింపుకార్డు చాల ముఖ్యమని, కార్డు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ తుది ఓటరు జాబితా తయారీలో భాగంగా పోలింగ్ కేంద్రం వారీగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో తొలగింపులు, చేర్పులు, మార్పులపై పరిశీలన చేస్తున్నామన్నారు. ముసాయిదా ఓటర్ జాబితా ప్రకారం జిల్లాలో 7లక్షల40వేల971మంది పురుష ఓటర్లు, 7లక్షల61వేల105మంది మహిళా ఓటర్లు, 127మంది ట్రాన్స్‌జెండర్లు, మొత్తం 15లక్షల2వేల203మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్వో అమరేందర్, ఆర్డీవో రమణారెడ్డి, అశోక్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ బాలమాయాదేవి, చిత్రంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి

హాస్టళ్లలో మెనూ తప్పకుండా పాటించాలి

బీసీ సంక్షేమ హాస్టళ్లల్లో తప్పకుండా మెనూ అమలు చేయాలని వసతి గృహాలను శుభ్రంగా ఉంచాలని బి. బాలమాయాదేవి ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని పలు వసతి గృహాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి కోర్సుల వివరాలను భోజనం ఎలా వండుతున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఖాజా నజీం ఆలీ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలి: కలెక్టర్

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించకుండా చూసుకోవాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. నవజాత శిశు కేసులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నీలోఫర్‌కు పంపించే సమయంలో ఆలస్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ పాల్గొన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

'భూభారతి' చట్ట రూపకర్త సునీల్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



చందంపేట మండలం కంభాలపల్లిలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, పాల్గొన్న సునీల్ తదితరులు

చందంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని భూ సమస్యలన్నింటినీ భూ భారతి చట్టం 2024 ద్వారా పరిష్కరిస్తామని భూ భారతి చట్ట రూపకర్త సునీల్, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలం కంభాలపల్లిలో రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని భూభారతి చట్టం 2024 రైతులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. చందంపేట మండలంలోని పొగిళ్ల, కంభాలపల్లి, రేకులగడ్డ తదితర గ్రామాలలోని పోడు భూములు, అటవీశాఖ అధికారుల ఆధీనంలో ఉన్న భూములన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు.

భూ భారతి చట్టం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు భూఆధార్ నెంబర్‌ను కేటాయిస్తామని, రాష్ట్రంలోని కోటి 52లక్షల ఎకరాలకు సంబంధించిన భూ వివరాలను భద్రపరిచి, ప్రతి భూ యజమాని హక్కులు కాపాడడమే భూ భారతి చట్టం లక్ష్యమ న్నారు. ఈ కార్యక్రమంలో లచ్చిరెడ్డి, ఆర్డీవో రమణా రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్యలతో 50 ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్నాం

50 ఏళ్లుగా భూములను సాగుచేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, భూపత్రాలు ఇవ్వకుండా అటవీ, రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని కంభాలపల్లి, పొగిళ్ల గ్రామాలకు చెందిన రైతులు కనకటి కోటయ్య, బద్దెల సత్యనారాయణ, చిరబోయిన వెంకటయ్య ఆవేదన

- మిగతా 8వ పేజీలో...

నాలుగో విడత
రుణమాఫీ ఏదీ?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి నివేదించినా నాలుగో విడత రుణమాఫీ కాలేదు. రూ.2లక్షల పైన రుణం ఉన్న రైతులకు కూడా రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని, మిగతా రుణాన్ని రైతులు చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించింది. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన నీలగిరి శ్రీనివాస్ ఏపీజీవీబీలో రూ.52,900 రుణం తీసుకున్నాడు. అతడి ఆధార్ నంబరు మరో రైతుకు రాయడంతో ప్రభుత్వం మూడు విడుతలు చేసిన రుణమాఫీలో అతడి పేరు లేదు. ఆధార్ నంబర్ సరిచేయించినా నాలుగో విడత కూడా తనకు రుణమాఫీ కాలేదని ఆ రైతు వాపోతున్నాడు. ఇలానే చాలా మంది రైతులు రుణమాఫీ కాలేదంటున్నారు. ఇదిలా ఉంటే రూ.2లక్షల రుణమాఫీకి సంబంధించి లబ్ధిదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్టు గుర్తించిన ప్రభుత్వం నిధులు జమ చేయకుండా నిలుపుదల చేసినట్టు సమాచారం. రుణమాఫీకి ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులుగా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదలచేసింది. ప్రభుత్వ ఉద్యోగులు చాలా మంది రూ.2లక్షల రుణమాఫీ జాబితాలో ఉండటంతో ఈ విడత నిలిపి, వారి పేర్లను తొలగించిన తరువాతనే నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

రుణమాఫీ నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వం గత నెల 29న నాలుగో విడత రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసి, నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. లబ్ధిదారుల జాబితాలూ విడుదల చేసింది. నేటికీ రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. యాసంగి వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేయాలి. అప్పు తీరితే రైతులు మళ్లీ రుణం పొందే అవకాశముంటుంది. రూ.2లక్షల పైన బాకీ ఉన్న రైతులకు కూడా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలి. రూ.2లక్షల పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. రూ.2లక్షలపైన పంట రుణాలు ఉన్న రైతులకు కూడా మాఫీ వర్తింపజేయాలి.

- యానాల దామోదర్‌రెడ్డి, రైతు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

అత్యధికంగా రుణమాఫీ జరిగింది



జిల్లాలో అత్యధికంగా రుణమాఫీ జరిగింది. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ జరగనుంది. సాంకేతిక సమస్యలతో ఇంకా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ పూర్తిచేయడమే కాకుండా నాలుగో విడతలో 21,495 ఖాతాలకు రూ.236.85కోట్లు విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా 2,33,981 ఖాతాలకు నాలుగు విడతల్లో రూ.2004.83కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

నెంబరు ప్లేట్ లేని ద్విచక్రవాహనాలు సీజ్



రాయిగిరిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరిరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నెంబరు ప్లేటు లేని వాహనాలను నడిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం భువనగిరి పట్టణ శివారులోని రాయిగిరి చౌరస్తా వద్ద నెంబరు ప్లేటు లేని ఆరు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా రాయిగిరి గ్రామంలో రిజర్వ్‌డ్ ఆర్మీ పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావొద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

ఉదాహరణలతో పాఠాలు బోధించాలి

● ప్రవచనకారుడు గరికపాటి నర్సింహారావు

ఆలేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ఉదాహరణలతో పాఠ్యాంశాలు బోధించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకారుడు డాక్టర్ గరికపాటి నర్సింహారావు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో జరిగిన శారదామాత జయంతి ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'విజ్ఞాన సమస్యలు,-తల్లిదండ్రుల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. పిల్లలను సమగ్రంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర అతి ముఖ్యమైనదన్నారు. పదో తరగతి వరకు విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద ఉంటూ చదవాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాల పనివేళల్లోని చివరి గంటలో కఠినమైన పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. ముందుగా శారదామాత చిత్రపటానికి ఆయన పూలమాల వేసి జ్యోతి వెలిగించారు. కార్యక్రమం ప్రారంభించిన అనంతరం స్థానికులు ఆయనను పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండిరాజుల శంకర్, వైస్ ప్రిన్సిపల్ తరిగొప్పుల రమేష్, మాజీ సర్పంచులు ఆకావరం మోహన్‌రావు, సందిల సురేష్, బండెల సుభాష్, మల్లేష్, శివమల్లు, సిద్ధులు పాల్గొన్నారు.

మరమ్మతుల నిధులతో ఏ పనులు చేశారు?

నడిగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలో గండ్లు పడిన ప్రాంతాల్లో నిధులు ఎలా ఖర్చుచేశారని ఎన్నెస్పీ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబరు 1వ తేదీన కురిసిన భారీ వర్షాలకు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో గండ్లు పడిన ప్రాంతాల్లో చేపట్టిన పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మరమ్మతులకు ప్రభుత్వం రూ.9కోట్లు మంజూరుచేయగా, ఆ నిధులతో పనులు ఎలా చేశారు, ఏం చేశారు, నీటి విడుదల సాఫీగా ఉందా, పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్ వాటర్ పరిస్థితిని ఆయన స్థానిక నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద గండి మరమ్మతులకు రూ.2కోట్లు, ఖమ్మం జిల్లాలో కుసుమంచి మండలంలో కుడి కాల్వ మరమ్మతులకు రూ.5కోట్లు, విద్యుత్ ప్రాజెక్టు మరమ్మతులకు రూ.2కోట్లు మంజూరు కాగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా పాలేరు వరకు 6.5లక్షల ఎకరాలకు, పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మం జిల్లా 2.54లక్షల ఎకరాలకు సాగు, తాగు నీరందిస్తుండగా ఆ మేరకు చివరి భూములకు నీరు అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. పాలేరు రిజర్వాయర్ నీటి మట్టం 23 అడుగులు కాగా ప్రసుత్తం 18.5 అడుగులు నీరు ఉందని అధికారులు ఈఎన్‌సీకి తెలిపారు. పనుల వివరాలను తెలుసుకున్న ఆయన సాయంత్రం నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నీటిపారుల శాఖ సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ రామకిషోర్, డీఈ రఘు, ఏఈలు సత్యనారాయణ, సరిత, క్వాలిటీ కంట్రోల్ అధికారులు రామకృష్ణ, దామదాసు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కాగితరామచంద్రాపురం వద్ద ఎడమకాల్వపై పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ

వరి సాగు తీరు మారే

నీటిపారుదల వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో వరి ప్రధానపంటగా సాగు చేస్తుంటారు. అయితే శతాబ్దాలుగా వరి సాగులో పాటిస్తున్నది సంప్రదాయ పద్ధతులే. అయితే వరి నాట్లలో కూలీలదే ప్రధాన పాత్ర. ఇటీవల కాలంలో కూలీల కొరత పెరగడటంతో సాగులో జాప్యం జరుగుతోంది. ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఈ దశలో ఇన్నాళ్లూ సంప్రదాయ పద్ధతులనే పాటించిన రైతులు ప్రస్తుతం ఆధునిక పద్ధతుల వైపు దృష్టి సారించారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ(వ్యవసాయం)

వరి సాగులో దశాబ్దాకాలంగా ఎన్నో పద్ధతులను వ్యవసాయ నిపుణులు రూపొందించారు. వాటిలో మెట్ట వరి,వెదజల్లే పద్ధతి,యంత్రంతో నాటు వేయడం, డ్రమ్ సీడర్ వంటి పద్ధతులు ప్రాచుర్యం పొందాయి. శ్రీవరి పద్ధతిలో సాగు కష్టంగా ఉండటంతో అంత ప్రాచుర్యంలోకి రాలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 13 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా నారు పోయకుండా బురదలో వడ్లు వెదజల్లే పద్ధతిని అధికంగా అనుసరిస్తు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. తరువాత డ్రమ్ సీడర్, యంత్రాలతో నాట్లు వేసుకోవడం వంటి పద్ధతులపై చాలా ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది వానాకాలం నుంచి సాగులో 65శాతంపైనే ఆధునికత పద్ధతులను చేపట్టారు.



వెదజల్లే పద్ధతి

వరిలో ప్రధానంగా వెదజల్లే పద్ధతి చాలా ప్రాచుర్యం పొందింది. వరినారు పోయకుండానే పొలందమ్ము చేసుకుని నేరుగా మొలక కట్టిన విత్తనాలు వెదజల్లుతుంటారు.

- ఎకరానికి 8-10 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- విత్తనాలను 24గంటలు నానబెట్టి తర్వాత వాటిని గోనె సంచిలో మండె కట్టి దమ్ము చేస్తున్న పొలంలో వెదజల్లుకోవాలి.
- పంట 7-10 రోజుల ముందు కోతకు వస్తుంది.
- నారు పోసే పని ఉండదు.
- దిగుబడి 10-15శాతం వరకు పెరుగుతుంది.
- ఈ పద్ధతితో రూ.6వేల వరకు ఆదా అవుతుంది.
- సమస్యాత్మక నేలలు తప్ప సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలకు ఈ పద్ధతి అనుకూలం.
- ముంపునకు గురయ్యే భూములు ఈ పద్ధతిలో సాగుకు అనుకూలం కాదు.
- విత్తనం వేసిన దగ్గర నుంచి మొక్క పెరిగే వరకూ నీటిని పెడుతూ తీస్తుండాలి.
- రైతులు ఈ పద్ధతిలో అత్యధికంగా సాగు చేస్తున్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతి



ఈపద్ధతిలోనూ దమ్ము చేసిన పొలంలో డ్రమ్ సీడర్ లాగడం వలన విత్తనాలు వేసుకోవచ్చు.

- ఎకరానికి 10-15 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- ఈ పద్ధతిలో విత్తనాలను నాటు కోవడానికి ముందు 24 గంటలు నానబెట్టి కొద్దిగా ముక్కు పగిలిన తరువాత డ్రమ్ సీడర్ వేసి విత్తుకోవాలి.
- డ్రమ్ సీడర్ మొత్తం 18 రంధ్రాలు కలిగి ఉంటాయి. 8 వరసల్లో వరుసకు మధ్య 20 సెంటీమీటర్ల దూరంలో విత్తనం పడుతుంది.
- కుదురుకు మధ్య దూరం 5-8 సెంటీమీటర్లు ఉంటుంది.ఒక్కో కుదురుకు 5-8 గింజలు పడతాయి.
- నారు పోసుకునే అవసరం ఉండదు.
- దమ్ము చేసిన వెంటనే డ్రమ్ సీడర్‌తో విత్తుకోవచ్చు
- ఎకరానికి రూ.5వేలు వరకు ఖర్చు తగ్గుతుంది.

యంత్రాలతో సాగు



- ఎకరానికి 20కిలోల విత్తనం అవసరమవుతుంది.
- వరి నారును ట్రేలలో పెంచుతారు.
- 20-25రోజులనారు నాటు వేయడానికి అనుకూలం.
- యంత్రంతో సాలుకు మధ్య దూరం 30 సెంటీమీటర్లు ఉంటుంది. మొక్కకు మొక్కకు మధ్య దూరం 12 నుంచి 21 సెంటీమీటర్ల వరకు యంత్రాన్ని సరి చేసుకోవచ్చు. 10-20 కర్రలు ఒకే సారి నాటు వేస్తుంది.
- యంత్రంతో రోజుకు 5 ఎకరాల వరకు నాటు వేసుకోవచ్చు.
- ఈ పద్ధతిలో వరుసల మధ్య గాలి, వెలుతురు బాగా వస్తుంది.
- సాధారణ పద్ధతుల కంటే 5-10 బస్తాల వరకు దిగుబడులు పెరుగుతాయి.

వరి సాగులో రైతులు ఆధునికత



వరి సాగులో కూలీల సమస్య తీవ్రంగా ఉంది. నాట్లు వేయడంలో జాప్యం అవుతోంది. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది నారు పోయకుండానే విత్తనాలు వెదజల్లే పద్ధతిలో వరిని రైతులు అధికంగా సాగు చేశారు. ఎకరానికి 10 కిలోలు సరిపోవడంతో పాటు నాటు కూలీలు ఖర్చు రూ.6వేల వరకు ఆదా అవుతుంది. డ్రమ్ సీడర్, యంత్రాలతో వరి నాట్లు వేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది సుమారు 65 శాతం మేర ఈ పద్ధతులనే రైతులు పాటిస్తున్నారు. పెట్టుబడులు తక్కువతో పాటు దిగుబడులు పెరగడంతో రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

- శ్రీధర్, వ్యవసాయాధికారి, చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా

డ్రోన్ వాడకంతో చాలా ప్రయోజనం



వరి సాగులో మందుల పిచికారీ చాలా ప్రమాదకరం. ఒక్కో సీజన్‌లో 4-5 సార్లు పిచికారీ చేయాల్సి వస్తోంది. దాంతో తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాం. మార్కెట్లో మందుల పిచికారీకి డ్రోన్ రావడంతో రూ.5లక్షలతో కొనుగోలు చేశా. నా సొంత పొలంతో పాటు ఇతర రైతుల పంటల పిచికారీకి వెళుతూ ఉపాధి పొందుతున్నా. ఆయకట్టులో 60 శాతం మంది రైతులు గత వానాకాలం సీజన్ నుంచి డ్రోన్‌ను విరివిగా వాడుతున్నారు.. భవిష్యత్‌లో డ్రోన్ల వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉంది.

- గోపగాని ప్రసాద్, బాబుసాయి పేట

యంత్రంతో 15 ఎకరాలు నాట్లు వేశా



వరి నాట్లు ఒకే సారి రావడంతో సరిపోను కూలీలు దొరకడం లేదు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌తో పాటు యాసంగిలో 15ఎకరాలలో యంత్రాలతో నాటు వేయించా. రెండు రోజుల్లో నాట్లు పూర్తయ్యాయి. ఎకరానికి రూ.4వేలు ఖర్చయింది. వరికర్రలు ఒకే పద్ధతిలో నాట్లు వేయడం వల్ల తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంది. దాంతో పిచికారీలతో పెద్దగా అవసరం పడదు. ఈ పద్ధతిలో మంచి దిగుబడులు వస్తున్నాయి. మంచి లాభదాయకంగా ఉంది.

- వీరమళ్ల అంతయ్య, రైతు, దుగ్గేపల్లి



డ్రోన్‌తో పిచికారీ



పంటలకు పురుగు మందుల పిచికారీకి పెట్రోలు పంపుతో పాటు ట్రాక్టర్ పంపులను వాడుతున్నారు. రసాయన మందుల వాసనతో రైతులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఊపిరితిత్తుల సమస్యలతో పాటు చర్మవ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఎంతో మంది రైతులు మృత్యువాత పడుతున్నారు. ఈ దశలో మందుల పిచికారీకి డ్రోన్లు మార్కెట్‌లోకి వచ్చాయి.

- డ్రోన్లతో మందుల వినియోగం 80 శాతం మేర ఉంటుంది.
- ఎకరానికి 10 నిమిషాలలో 10-12 లీటర్ల నీటిని పిచికారీ చేస్తుంది. దాంతో సమయం చాలా ఆదా అవుతుంది.
- ఈ పద్ధతిలో మందుల వినియోగం 100 శాతం మేర ఉంటుంది.
- ఎకరం పిచికారీకి రూ.400 మాత్రమే ఖర్చు అవుతుంది.
- ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచే మందుల పిచికారీకి రైతులు డ్రోన్‌ను అధికంగా వినియోగిస్తున్నారు.

పోలీసులు న్యాయం చేయాలి

● సెల్‌టవర్ ఎక్కి ఆటోడ్రైవర్ హల్‌చల్

కట్టంగూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తనపై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆటోడ్రైవర్ సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల శివారులో రెండుగంటల పాటు సెల్‌టవర్‌పైనే ఉండిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల చింతల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నకిరేకల్‌లో ఆటో రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా చింతల్‌ను నకిరేకల్‌కు చెందిన కొందరు చితకబాదారు. ఈ ఘటనపై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా వారు పట్టించుకోలేదు. దీంతో న్యాయంచేయాలని కోరుతూ సోమవారం అయిటిపాముల శివారులోని ఓ సెల్‌టవర్ ఎక్కి రెండుగంటల పాటు హల్‌చల్ సృష్టించాడు. విషయం తెలుసుకున్న కట్టంగూరు ఎస్ఐ రవీందర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. ఫోన్‌లో చింతల్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని ఎస్ఐ హామీఇవ్వడంతో చింతల్ కిందికి దిగి వచ్చాడు. అనంతరం పోలీసులు అతడిని నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





పోలీసుల అదుపులో ఆటోడ్రైవర్ చింతల్, టవర్‌పై చింతల్(రౌండ్‌లో)

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో హైదరాబాద్-భూపాలపల్లి జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్వల్పగాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి 30 మంది ప్రయాణికులతో బయలుదేరింది. సుమారు 8.45 నిమిషాలకు యాదగిరిగుట్ట మండలం మోటకొండూరు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వద్ద అదుపు తప్పి రోడ్డు మధ్యలో బ్రిడ్జి నిర్మాణం కోసం ఏర్పాటు చేస్తున్న చువ్వల జాలీమీదకు దూసుకెళ్లింది. ఈ ఘటనతో ప్రయాణికుల్లో కొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆర్టీసీ బస్సును అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



అదుపు తప్పి రోడ్డు మధ్యలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

హాలియా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా హాలియా పట్టణానికి చెందిన టైం పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సముక్త ఎంపికైంది. ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కోర్బ జిల్లాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ జట్టు తరుపున పాల్గొననుంది. రాష్ట్రస్థాయిలో నవంబరు 8, 9, 10 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్స్ నులక రవీందర్‌రెడ్డి, మంద నరేందర్‌రెడ్డి, కత్తి కోటిరెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థి సముక్తను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆ ఇద్దరు పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు(ఎం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. బాధితుడు మారుపాక శ్రీకాంత్ సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన మారుపాక శ్రీకాంత్ ఈ నెల 20వ తేదీన అదే గ్రామానికి చెందిన ఆదే నర్సయ్య మధ్య ఖాళీ స్థలం విషయంలో మాటామాటా పెరిగి ఒకరినొకరు నెట్టివేసుకున్నారు. ఈ విషయంలో ఆదే నర్సయ్య అదేరోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. రాయిపల్లిలో గొడవ జరిగిన విషయాన్ని వెంటనే నర్సయ్య హైదరాబాద్‌లో ఉన్న తన కుమారులు మల్లేశం(సివిల్ కానిస్టేబుల్, ఉప్పల్), నరేష్(ఏఆర్ కానిస్టేబుల్, హైదరాబాద్)లకు చెప్పి రావాలని ఫోన్ ద్వారా సమాచారం అందజేశాడు. ఎస్ఐ క్రిష్ణయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తుండగా అదే సమయంలో వచ్చిన శ్రీకాంత్ సైతం అక్కడే నిలబడ్డాడు. ఈలోగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న నర్సయ్య కుమారులు మల్లేశం, నరేష్‌లు ఎస్ఐ పక్కనే ఉన్నప్పటికీ మా నాన్నను కొడతావా అంటూ తనను అసభ్యంగా తిడుతూ, కాళ్లతో తన్నినట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ ఘటన అనంతరం తనపై దాడి చేసిన ఇరువురు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి శ్రీకాంత్ ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వమంటే నాలుగు రోజుల నుంచి ఎస్ఐ దాటవేస్తున్నాడని శ్రీకాంత్ ఆరోపించారు. తనపై దాడి చేసిన ఇరువురు కానిస్టేబుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని శ్రీకాంత్ కోరారు. శ్రీకాంత్ ఆరోపణలపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా శ్రీకాంత్ ఫిర్యాదు ఇచ్చిన రోజే ఇరువురు కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం పాయింట్ Crime point

అప్పుల బాధతో ఆత్మహత్య



వెంకన్న(ఫైల్)

గరిడేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన నన్నెపంగు వెంకన్న(42) గరిడేపల్లిలోని భారత్ పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వెంకన్న సొంత ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశారు. సోమవారం విధుల్లో భాగంగా పెట్రోల్‌బంక్‌కు వచ్చాడు.కొద్దిరోజులుగా అప్పులు తీర్చలేక ముబావంగా ఉంటున్న ఆయన క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియాఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మృతి చెందాడు. వెంకన్న భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వెంకన్నకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

కట్టంగూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అతివేగం, అజాగ్రత్తతో కారు ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో సోమవారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన గోపాసి భిక్షం(59) ఆదివారం అయిటిపాముల గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చి తిరిగి సోమవారం తన స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపై ఆటో కోసం నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఏపీ39ఎస్పీ2270 నెంబర్ గల కారు హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళుతూ అతివేగంగా వచ్చి భిక్షంను ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భిక్షం కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని మహిళ...

అనంతగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం ఖానాపురంలో సోమవారం జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన రెడ్డిబోయిన మల్లయ్య, సరోజిని దంపతులు ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం గ్రామంలోని సరోజిని తల్లి ఇంటికి ఆటోడ్రైవర్ కోట వీరబాబుతో కలిసి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఖానాపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటోలోని సరోజినీ(38) అక్కడికక్కడే మృతిచెందింది. ఆటో డ్రైవర్ కోట వీరబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. సరోజిని భర్త మల్లయ్యకు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో మృతదేహాన్ని, క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

సూర్యాపేటలో పట్టపగలు చోరీ

సూర్యాపేట క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని 28వవార్డులోని జేజేనగర్, శబరిమిల్క్ సెంటర్ పక్కవీధిలో ఓ ఇంట్లోకి చొరబడి మూడు ల్యాప్‌ట్యాప్‌లను, కొంత నగదును దొంగించుకొని పారిపోయాడు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట పట్టణ పోలీసులు పరిశీలించారు. వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించి ప్రాథమిక విచారణ అనంతరం కేసు నమోదు చేసిదర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

పాఠశాల తలుపులు పగులకొట్టిన దుండగులు

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల తరగతి గది తలుపులు ధ్వంసంపై ప్రధానోపాధ్యాయుడు శ్రావణ్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన హెచ్ఎంకు ఆవరణలో మద్యం బీరు బాటిళ్లు కనిపించాయి. అదేవిధంగా తరగతి గది తలుపులు పగిలి ఉన్నాయి. ఆరు నెలల్లోనే ఈ పాఠశాల్లో మూడుసార్లు ఇలాంటి సంఘటనలు చూడటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రవణ్‌కుమార్ తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ గ్రామాలను హేతుబద్ధంగా పునర్ వ్యవస్థీకరించాలి

● మండలిలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి



తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ గ్రామాలను హేతుబద్ధంగా పునర్వ్యవస్థీకరించాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన శాసనమండలి సమావేశంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని గ్రామాలు పలు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉంటున్నాయని అన్నారు. దీని వల్ల కొన్ని గ్రామాల్లో భూ విస్తీర్ణం అత్యధికంగా ఉండడంతో పాటు ఆయా గ్రామాల రైతులు తమ భూముల అమ్మకాలు, కొనుగోలు చేసే క్రమంలో చేసే చెల్లింపులు, స్టాంపు డ్యూటీ తదితర ఆదాయం సంబంధిత గ్రామాలకు చెందకుండా రెవెన్యూ గ్రామాలకు చెందుతుందని అన్నారు. దీని వల్ల భూములు కలిగి ఉన్న గ్రామపంచాయతీలకు ఆదాయం దక్కకుండా రెవెన్యూ గ్రామాలకు చెందుతుందని పేర్కొన్నారు. ఉదాహరణకు తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామం గురించి ప్రస్తావించారు. గ్రామంలోని 1600 ఎకరాల భూవిస్తీర్ణాన్ని అక్కడి గ్రామ రైతులు సేద్యం చేస్తున్నప్పటికీ సంబంధిత గ్రామ రైతుల భూములు సమీపంలో ఉన్న నేతాపురం, సూరేపల్లి, కొంపల్లి, రాజవరం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఎన్నో ఏండ్లుగా ఉంటున్నాయన్నారు. ఈ విధంగా రెవెన్యూ రికార్డుల్లో ఒక్క ఎకరం కూడా బోయగూడెం గ్రామ పరిధిలో లేనటువంటి పరిస్థితి ఉందన్నారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతిలో రెవెన్యూ గ్రామాలను హేతుబద్ధీకరించి అర్హులైన రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు.

అవగాహనే అస్త్రం..

దైనందిన జీవితంలో నాణ్యమైన సరుకులు, ప్రమాణాలతో కూడిన సేవలు పొందడం గగనమైంది. చట్టాల పరంగా వినియోగదారులకు పలు హక్కులు, నష్టపోతే పరిహారాలు పొందే చట్టాలున్నప్పటికీ వాటిపై ప్రజల్లో అవగాహన అంతంత మాత్రమే. తాను వెచ్చించే ప్రతి రూపాయికీ నిర్ణీత నాణ్యతగలిగిన వస్తువులను, ప్రమాణాలతో కూడిన సేవలు పొందే హక్కు ప్రతి వినియోగదారుడికీ ఉంటుంది. పేస్టులు, పెన్నులు మొదలు అన్ని రకాల వస్తువుల కొనుగోళ్లు, హోటళ్లలో ఆహారం, మెడికల్ దుకాణాల్లో ఔషధాలు, వైద్యసేవలు, విమానరంగ సేవల వరకు, రైతులు కొనుగోలు చేసే విత్తనాలు మొదలు ఎరువులు, పురుగుమందుల్లో మోసపోతే వినియోగదారుల రక్షణ చట్టాల ద్వారా వారికి పరిహారం దక్కుతుంది.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

» దైనందిన జీవితంలో ప్రతి లావాదేవీ వినియోగదారుల హక్కుల పరిరక్షణచట్టం పరిధిలోకే

» నల్లగొండ జిల్లాలో ఫిర్యాదుల పరిష్కారంలో కమిషన్ వేగవంతం

» ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, వర్చువల్‌గా విచారణకూ అవకాశం



నల్లగొండ జిల్లాకేంద్రంలోని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయం

నాణ్యమైన వస్తువులను నిర్ధారిత ధరలకే పొందే హక్కులతో పాటు, అధిక ధరలకు అమ్మితే వారిపై కూడా ఫిర్యాదు చేసే అధికారం వినియోగదారులకు ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా జరిగే వ్యాపారాలలోనూ వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే చర్యలు పొందవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం - 2019 అమల్లోకి వచ్చాక వినియోగదారులకు హక్కుల చట్టాలు మరింత చేరువయ్యేలా సంస్కరణలు అమలవుతున్నాయి. డిసెంబరు 24న జరిగే జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారులహక్కులు, చట్టాలు, జిల్లాలో కమిషన్ పరిష్కరిస్తున్న ఫిర్యాదులు, పరిహారం పొందిన కొన్ని కేసుల వివరాలతో ఆంధ్రజ్యోతి కథనం.

వినియోగదారుల చట్టం పరిధిలోకి వచ్చే రంగాలు

వస్తువులు, పదార్థాలు, వాహనాల ఉత్పత్తిదారులు, విద్యారంగం, వైద్యరంగం, ఔషధరంగం, బీమారంగం, బ్యాంకింగ్ సేవలు, నాన్‌బ్యాంకింగ్ సేవలు, చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ వ్యాపారాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, అన్ని రకాల సేవారంగాలు.

ఫిర్యాదు ఎలా చేయాలి

వినియోగదారులు తాము చేసిన లావాదేవీల్లో, కొనుగోళ్లలో, పొందిన సేవల్లో నష్టపోయినా, ప్రాణనష్టం జరిగినా, ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొన్నా, మోసపోయినా ప్రాథమికంగా తాము నివాసముండే జిల్లా పరిధిలోకి వచ్చే జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలి. గతంలో వస్తువు, సేవ ఎక్కడ పొందినా, ఉత్పత్తిదారుడి ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాల్సి ఉండడంతో దూరాభారం, వ్యయప్రయాసల నేపథ్యంలో పలు వినియోగదారుల సమస్యలు తలెత్తినా ఫిర్యాదులు చేసే అవకాశం లేకుండాపోయింది. రశీదులు, అవసరమైన పత్రాలను కమిషన్‌కు అందజేయాలి. తాను కొనుగోలు, లేక సర్వీసు పొందిన తేదీ నుంచి రెండేళ్ల కాలపరిమితిలో ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన 50రోజుల్లోనే దాన్ని కమిషన్ పరిష్కరించాల్సి ఉంటుంది. కమిషన్ తీర్పుపై అభ్యంతాలుంటే రాష్ట్ర కమిషన్‌కు, ఆ తర్వాత జాతీయ కమిషన్‌కు కూడా ఫిర్యాదుదారు కానీ, ఉత్పత్తిదారు, సర్వీస్‌ప్రొవైడర్‌కానీ అప్పీల్ చేయవచ్చు.

వినియోగదారుడి విజయం

లాక్‌డౌన్ సమయంలో నల్లగొండకు చెందిన ఒక ప్రయాణికుడు ఓ కన్సల్టెన్సీ ద్వారా హైదరాబాద్ నుంచి స్టాన్‌ఫర్డ్(జర్మనీ)కి విమాన టిక్కెట్ రూ.26,180కి బుక్‌చేశాడు. సదరు విమానం రద్దవడంతో పాటు, తిరిగి రీషెడ్యూల్ చేయకపోవడం, ప్రయాణికుడికి టిక్కెట్ ధరని తిరిగి ఇవ్వకపోవడంతో అతను 2022లో జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును విచారించిన జిల్లా కమిషన్ సదరు కన్సల్టెన్సీ వినియోగదారుడికి రూ.75,000 పరిహారమివ్వాలని తీర్పునిచ్చింది. ఇవే కాకుండా చిరునామాల్లో పొరపాట్లుంటే బీమా మొత్తం చెల్లించకుండా తప్పించుకుంటున్న ఇన్సూరెన్స్ కంపెనీలు, వినియోగదారులను మోసం చేసిన పలు తయారీ కంపెనీల నుంచి సదరు ఫిర్యాదుదారులకు పరిహారాలిచ్చేలా తీర్పులు వస్తున్నాయి.


ఫిర్యాదులు త్వరగా పరిష్కరిస్తున్న వినియోగదారుల జిల్లా కమిషన్

నల్లగొండ జిల్లాలో వినియోగదారుల కమిషన్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెరిగింది. కొత్త చట్టంలో పేర్కొన్న ప్రకారం అయిదు మాసాల్లోనే తీర్పులివ్వాలనే సూచనల మేరకు వేగవంతమైన పరిష్కారానికి కమిషన్ అధ్యక్షుడు, సభ్యులు పనిచేస్తున్నారు. జిల్లాలో కమిషన్ ఏర్పాటైన 1988 నుంచి ఇప్పటివరకు 4156 కేసులు నమోదవగా, అందులో 3,938 కేసుల్లో తీర్పులిచ్చారు. 2019 వరకు వందశాతం ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి 2019 వరకు 32 ఏళ్ల కాలంలో మొత్తం 3604 ఫిర్యాదులు రాగా, అన్నింటికి అన్నీ పరిష్కారమయ్యాయి. ఆ తర్వాత ఈ అయిదేళ్లలో 552 ఫిర్యాదులకు, 334 పరిష్కారమవగా, ఇంకా 218 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

కమిషన్ పరిష్కరించిన ఫిర్యాదులు ఇలా..

సంవత్సరం	వచ్చిన ఫిర్యాదులు	పరిష్కారమైనవి	పెండింగ్‌లో ఉన్నవి
1988-2019	3604	3604	----
2020	81	77	04
2021	107	93	14
2022	100	81	19
2023	124	64	60
2024	140	19	121
మొత్తం	4156	3938	218

ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసే సౌలభ్యాన్ని వినియోగించుకోవాలి



వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం -2019 ప్రకారం వినియోగదారులు తమ ఫిర్యాదులను నేరుగా కమిషన్ వద్దకు వెళ్లి ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చు. ఇది వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, ఫిర్యాదులకు అవసరమైన పత్రాలను జతచేసి పంపాల్సి ఉంటుంది. ఫిర్యాదులపై విచారణలు సైతం వర్చువల్‌గానే నిర్వహించి తీర్పులిచ్చే వెసలుబాటు కొత్త చట్టం కమిషన్లకు అందజేసింది.

\- అన్నెబోయిన మట్టయ్య, వినియోగదారుల సంఘాల సమన్వయకమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి

ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నాం



వినియోగదారుల కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. జిల్లా కమిషన్ పరిధిలో 2020 వరకు ఉన్నకేసులన్నీ పరిష్కరించాం. ఆ తర్వాత వచ్చే ఫిర్యాదులపైనా వేగంగా విచారణ జరిపి తీర్పులిస్తున్నాం. కొత్త చట్టాల ప్రకారం ఆన్‌లైన్‌లో కూడా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. నాలుగు సెట్ల పత్రాలను మా కార్యాలయానికి పంపాలి. ఫిర్యాదు అందిన అయిదునెలల్లో తీర్పు వచ్చేలా విచారణలో వేగం పెంచాం.

\- మామిడి క్రిస్టోఫర్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

హక్కుల గురించి వినియోగదారులకు అవగాహన పెరగాలి



వినియోగదారుల హక్కులు, నష్టపోతే పొందే పరిహారాలపై మహిళల్లోనూ అవగాహన పెరగాలి. ప్రధానంగా నిత్యావసర వస్తువులు, నూనెలు, గృహోపకరణాలు కొనేటప్పుడు తప్పనిసరిగా వాటి గురించి సమాచారం తెలుసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్స్ పరిశీలించి చూడాలి. నష్టం జరిగినా, ఆ వస్తువుల వాడకంతో అనారోగ్యం పాలైనా, లేక ప్రాణనష్టం జరిగినా వెంటనే కలెక్టర్ కార్యాలయంలో అదేవిధంగా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి.

\- ఎస్. సంధ్యారాణి, సభ్యురాలు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

వర్చువల్ విచారణల్లో సవాళ్లను అధిగమించేలా చర్యలుండాలి



ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, వర్చువల్ విచారణల్లో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, డిజిటల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన తక్కువగా ఉన్నవారు, ఆర్థికంగా బలహీన స్థితిలో ఉన్నవారికి ఈసేవలు పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆన్‌లైన్ విచారణ జరుగుతున్న సందర్భాల్లో నెట్ కనెక్టివిటీ కోల్పోవడం, పరస్పరం విచారణకు ఆస్కారం లేకపోవడంతో బాధితులకు న్యాయం జరగడంపై అపోహలు ఏర్పడే అవకాశాలుంటాయి.

\- వెంకటేశ్వర్లు, తెలంగాణ వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి

క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబు

● రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరణ ● ఇళ్లపై కాగితాల నక్షత్రాలు ఏర్పాటు ● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన చర్చీలు

క్రిస్మస్ వేడుకల కోసం ఉమ్మడి జిల్లాలోని చర్చీలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. 25వ తేదీన ఏసుక్రీస్తు పుట్టిన వేడుకలను క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. వేడుకలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. క్రైస్తవులు ఇళ్లపై రంగుల కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారు చేసి ఉంచారు. శాంతాక్లాజ్ (ఫాదర్ క్రిస్మస్) ఆకాశం నుంచి ధ్రువపు జింకులు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇస్తారని నమ్ముతారు. క్రిస్మస్ రోజున బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతారు. 26వ తేదీన బాక్సింగ్ డే సందర్భంగా క్రిస్మస్ వేడుకల్లో వచ్చిన బహుమతులను విప్పి సంతోషంగా గడుపుతారు.

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కల్చరల్, శాలిగౌరారం, మఠంపల్లి)

నల్లగొండ జిల్లాకేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల మరియారాణి కెథ్రిడల్ చర్చీ, క్లాక్ టవర్ సెంటర్‌లోని తెలుగు సెల్ఫ్ సపోర్టింగ్ బాప్టిస్ట్ చర్చీలు ఆధ్మాతిక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిల్లో నెల రోజుల నుంచి భక్తి గీతాలు ఆలపిస్తున్నారు. దేవర కొండ రోడ్డులోని మరియామాత కెథ్రిడల్ చర్చిని 1903 సంవత్సరంలో ఫెజ్జోని పాదర్ ప్రారంభించారు. చర్చీ ప్రారంభించినప్పుడు కేవలం 150మంది రోమన్ క్యాథలిక్ భక్తులు మాత్రమే ప్రార్థనలకు వచ్చేవారు. అప్పుడు ఈ దేవాలయం హైదరాబాద్ మేత్రాస్ పరిధిలో ఉండేది. రోజురోజుకు భక్తులు పెరుగుతున్నందున చర్చిని పునరుద్ధరించారు. 1977వ సంవత్సరంలో మ్యాథియా చర్చియన్ కున్నేల్ ఈ దేవాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి నేటివరకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరా జిల్లుతోంది. సుమారు 5వేల మంది భక్తులు నేడు ఆ చర్చిల్లో ప్రార్థనలు చేస్తున్నారు. ప్రస్తుతం దామన్ కుమార్ బిషప్‌గా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా క్లాక్‌టవర్ సెంటర్‌లోని తెలుగు సెల్ఫ్ సపోర్టింగ్ బాఫిస్ట్ చర్చీ 1891 సంవత్సరంలో పాస్టర్ అబ్రహాం ఈ చర్చికి పునాది వేశారు.



వంగమర్తిలో 117 సంవత్సరాల చర్చీ

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వంగమర్తి, ఇటుకుల పహాడ్, అంబారిపేట గ్రామాల్లోని చర్చీలు జిల్లాలోని ప్రసిద్ధి చెందాయి. మూడు రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహించే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవులు ఇక్కడికి హాజరు కానున్నారు. వంగమర్తి గ్రామానికి 1975లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నుంచి వలస వచ్చి స్థిరపడిన రోమన్ క్యాథలిక్‌లకు నాటి బ్రిటీష్ విచారణ పాధర్‌గా ఉన్న 'ఫింటోని' మొదట పూరి గుడిసెలో క్రీస్తు ప్రార్థనలు చేయించారు. తర్వాత పెంకుటిల్లులో చర్చి నిర్మించారు. ఆ తర్వాత చర్చీ పాదర్‌గా వచ్చిన 'తిరంజోని'ఆధ్వర్యంలో వంగమర్తి గ్రామంలో 1907 సంవత్సరంలో పునీత జోజప్ప పేరుతో చర్చిని నిర్మించారు. 1934 సంవత్సరంలో మొదటిసారి, 2005లో రెండోసారి చర్చిని ఆధునికీకరించారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో లూర్థుమాత క్రైస్తవ చర్చిని 1955 సంవత్సరంలో నిర్మించారు.



మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో ఆలయంలో ఏర్పాటు చేసిన నక్షత్రం



సూర్యాపేట జిల్లాకేంద్రంలో ముస్తాబైన చర్చి



నల్లగొండలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి





ఆలేరులో నృత్యాలు చేస్తున్న చిన్నారులు, హుజూర్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

రైతుల సంక్షేమానికి పెద్దపీట

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడి

నల్లగొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతుల సంక్షేమం కోసం డీసీసీబీ పరిధిలోని సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును తెలంగాణలోనే మొదటి స్థానంలో ఉంచేందుకు అధికారులు, ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.2700కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు పురోగతిలో ఉందని, రూ.3వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డిపాజిట్‌లో మాసోత్సవాల సందర్భంగా రూ.100కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నామని, ఇప్పటికే రూ.50కోట్లకు పైగా డిపాజిట్ సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, జయరాంనాయక్, వేమూరి రంగాచారి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, మొగిలిపాక రామచంద్రయ్య, బ్యాంకు సీఈవో ఆర్. శంకర్‌రావు, నాబార్డు డీడీఎంలు వినయ్‌కుమార్, సత్యనారాయణ, జేఆర్‌వోఎస్‌డీ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

రామన్నపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని వెల్లంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గూని అభియనశ్రీ జాతీయ స్థాయి రగ్బీ అండర్ -17 పోటీలకు ఎంపికైంది. బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. సురేందర్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అభినయశ్రీని ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, పారిజాత, యాదగిరి, శ్రీనురెడ్డి, హేమలత, స్వప్న, రేణుక తదితరులు అభినందించారు.

హరిహరులకు విశేష పూజలు



ధనుర్మాసోత్సవాల్లో పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు, అలంకరణలో గోదాదేవి అమ్మవారు

భువనగిరి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచ రాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు రూ.26,86,559 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయంలో వేకువజామున ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తుల మంగళ హారతులతో గోదాదేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా హనుమత్ గాయత్రీ మహాయజ్ఞం



నార్కట్‌పల్లిలో హనుమత్ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవంలో భాగంగా హనుమత్ గాయత్రీ యజ్ఞాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గుండేపూడి జానకిరామశర్మ, సహార్చకులు ఉత్తరాపల్లి నర్సింహ్మాచార్యులు శిష్య బృందం యాజ్ఞీకంలో జరిగిన ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, చందన అలంకరణ, మండపారాధన నిర్వహించారు. బండారు గణేశ్ కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు అనంతుల నాగరాజు, నడింపల్లి శ్రవణ్‌కుమార్, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్ రావు, మేడబోయిన శ్రీనివాస్, వడ్డేగోని రామలింగం, నేమలు నాగరాజు, భక్తులు కన్నెబోయిన నర్సింహ్మా, దోసపాటి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

● మసీదు ఎదురుగా ఉన్న స్థలంలోనే యజ్ఞాన్ని నిర్వహిస్తామని పట్టుబట్టి రోజంతా హనుమాన్ స్వాములు, భక్తులు గత వారం ఆందోళన చేసిన నేపథ్యంలో నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటుచేశారు. మసీదుకు ఇరువైపులా పోలీసులను మోహరించారు. వివాదాస్పద స్థలం మసీదు ఆవరణకు వెళ్లకుండా బారికేడ్లు అడ్డు పెట్టారు. యజ్ఞ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

నేడు టెండర్ కం వేలం

కనగల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలం దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏడాది కాలానికి వివిధ వస్తువులను విక్రయించే హక్కులను కల్పించడానికి మంగళవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు సకాలంలో ఆలయం వద్ద చేరుకోవాలని ఆయన సూచించారు.

నాటి సందులూరే.. నేటి చందూరు

» చండూరులోనే తొలి అయుత ఛండీయాగం » 300ఏళ్ల క్రితం నిర్వహణ » చండీయాగంతో చండూరుగా నామకరణ



కనకదుర్గ పురాతన దేవాలయం

చండూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరులో చండీమాత ఆలయం (కనకదుర్గ దేవాలయం) వద్ద అయితే 300 ఏళ్ల క్రితమే అయుత చండీయాగం నిర్వహించినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఇక్కడ చండీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించినప్పుడు వారం రోజుల పాటు ఈ యాగం నిర్వహించినట్లు పురోహితులు తెలిపారు. చండీయాగం నిర్వహించడం వల్లే గ్రామానికి చేండూరుగా పేరుగా మారిందని, అది రూపాంతరం చెంది చెండూరుగా తర్వాత చండూరుగా స్థిరపడిందని పట్టణానికి చెందిన పంచాంగకర్త చిరువెళ్లి హరికిషన్‌శర్మ తెలిపారు. యాగం విషయంపై తన తండ్రి ఎప్పుడూ వివరించేవారని తెలిపారు. అంతేకాక ప్రాచీన కాలం నుంచే హోమాలకు చండూరు ప్రసిద్ధి గాంచిందని పేర్కొన్నారు. చండీయాగం స్ఫూర్తి తోనే 60 ఏళ్ల క్రితమే గురువు ఇంటింటికి భిక్షాటన చేసి నిధులు, బియ్యాన్ని సమకూర్చినట్లు పూర్వీకులు చెప్పేవారని స్థానిక వ్యాపారవేత్త సముద్రాల వెంకన్న తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లిలో డిసెంబరు 23 నుంచి 27 వరకు నిర్వహించిన అయుత చండీయాగం దేశంలోనే రెండోవదని చరిత్రకారుల, పండితులు చెబుతున్నారు.

చండూరు ఎలా వచ్చిందంటే...

ఒకప్పుడు చండూరుకు తూర్పున ఉన్న ఊరు బ్రాహ్మణగూడెం. పడమట ఉన్న ఊరు సీతారాంపురం. ఈ సమయంలో సందులు అధికంగా ఉన్న చోట సదానందస్వామి దేవాలయం (శివాలయం) వెలిసింది. బ్రాహ్మణగూడెం, సీతారాంపురం రెండు ఊర్లు ఈ దేవాలయం పరిధిలోనే కలిసిపోయాయి. దేవాలయం చుట్టూ సందులు అధికంగా ఉండడంతో మొదటగా సందులూరుగా పేరుగాంచింది. రానురానుగా సందూరుగా.. చందూరుగా.. చండూరుగా పేరుగా మారింది. పట్టణంలో నాడు అధికంగా సందులు ఉండటం వల్ల పెద్దగా పట్టణంలోకి ఒకటి, రెండుమార్లు ఇంటికి వెళ్లి చూసి, మరోమారు గుర్తు పట్టడం కష్టం. పట్టణంలో ఆ స్థాయిలో సందులు ఉండేవి.

చండీయాగంలో రుత్వికుడిగా చండూరువాసి



మెదక్ జిల్లా ఎర్రవెల్లిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన అయుత చండీయాగంలో ప్రధాన హోమం గుండం వద్ద చండూరు పట్టణానికి చెందిన రువెళ్లి అజయ్‌శర్మ విధులు నిర్వహించాడు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా సప్తశతి పారాయణం, హోమం, జపం, తత్వం కార్యక్రమాలు నిర్వహించే వారిని రుత్వికులు అంటారు. హోమం యాజమాని నాటి సీఎం కేసీఆర్ కాగా ఆయన తరపున కార్యక్రమాలను నిరాటంకంగా నిర్వహించిన రుత్వికుల్లో ఒకరు రువెళ్లి అజయ్‌శర్మ. ఇంజనీరింగ్‌లో అవకాశం వచ్చినా, తన తాత పంచాంగకర్త చిరువెళ్లి శ్యాంసుందరశర్మ అడుగు జాడల్లో నడవాలని నిర్ణయించుకున్నాడు. గజ్వేల్ సమీపంలోని వర్గల్ ప్రాంతంలోని సరస్వతి, శనేశ్వర ఆలయ సమీపంలో ఉన్న శారద స్మార్త వైదిక పాఠశాలలో ఉప్పల అనంతగిరిస్వామి వద్ద శిష్యుడిగా చేరాడు. అనంతగిరి స్వామి శిష్యులకు ఈ యాగంలో రుత్వికులుగా అవకాశం రావడంతో అజయ్‌శర్మకు హోమం వద్ద రుత్వికుడిగా అవకాశం లభించింది. తన కుమారుడు అజయ్‌శర్మను అన్నిరకాల తత్వాలు నేర్చుకున్న వ్యక్తిగా చూడటం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు శ్రీదేవి, హరికిషన్‌శర్మ తెలిపారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

శాలిగౌరారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని 106 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మందుల సామేలు అందజేస్తారని తహసీల్దార్ యాదగిరి తెలిపారు. లబ్ధిదారులందరూ సకాలంలో రావాలని ఆయన కోరారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే సామేలు ప్రారంభిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు.

● కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంగళవారం చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాసయాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

గీత వృత్తిదారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న, సీతారాములు

నల్లగొండ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గీత వృత్తిదారులను ఆదుకోవాలని తెలంగాణ కాల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని గీత కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలకులు మారినా గీత కార్మికుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది గడిచినా సంక్షేమ పథకాల అమలుచేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. గీత కార్మిక వృత్తి ప్రమాదమని తెలిసినా బతుకుదెరువు కోసం తాటిచెట్లు ఎక్కి కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. జిల్లాలో 30వేల మంది గీత వృత్తిపైన ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలని లేనిచో గీత కార్మికులంతా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదల పాలిట వరం

● ఎమ్మెల్యే వేముల వీరేశం



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, గుత్తా మంజుల

నకిరేకల్, కనగల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం పేదల పాలిట వరంలాంటిదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి సంబంధించిన 83మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ పై రాయితీ, 200 యూనిట్లు ఉచిత కరెంట్ అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 7లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో పదేళ్ల అధికారంలోకి ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చే యలేదని అన్నారు. ఈ రేసింగ్ అనే కార్ రేసింగ్ పెట్టి కేటీఆర్ ప్రజల సొమ్మును దోచుకున్నాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గంలో 30 ఎకరాల్లో రూ. 200కోట్లు పెట్టి ఒకేచోట గురుకుల పాఠశాలల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన ఐదుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. తహసీల్దార్ పద్మ తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ దేప కరుణాకర్‌రెడ్డి, డీటీ పార్వతమ్మ, ఏఆర్ఐ యాదగిరి, జేఏ లతీఫ్ పాల్గొన్నారు.

ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

మునుగోడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వర్తించాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని చండూరు ఆర్డీవో శ్రీదేవి హెచ్చరించారు. మునుగోడు తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో టపా విషయంలో విధుల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పగిళ్ల యాదగిరితో శుక్రవారం గిర్దావర్ సట్టు నాగరాజు గొడవపడి చేయి చేసుకొన్న ఘటన తెలిసిందే. ఈ మేరకు తనపై చేయి చేసుకొన్న వ్యవహారంపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఆర్డీవో విచారణ చేపట్టారు.

విధుల్లో ఉన్న ఉద్యోగులందరినీ వేర్వేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఇచ్చిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఆమె తెలిపారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి



కొట్టాలలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో మున్నయ్య

మర్రిగూడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఈ నెల 30వ తేదీ వరకు పూర్తి చేయాలని మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్య సూచించారు. మండలంలోని కొట్టాల, ఇందుర్తి, శివన్నగూడ పలు గ్రామాల్లో సోమవారం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటింటి లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపై నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే చేయడంలో మర్రిగూడ మండలం వెనకబడి ఉందని, లక్ష్యాన్ని చేరుకోవాలంటే వేగవంతం చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు సర్వే పూర్తి కాకుంటే ఆదివారం కూడా సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు. లేని చో కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరగా పూర్తి చేసి నివేదిక అం దజేయాలని అన్నారు.

1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ జామ్లా

శాలిగౌరారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాం కును జనవరి 1 నుంచి రాష్ట్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నందున ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకింగ్ సేవలు నిలిపివేయనున్నట్లు శాలిగౌరారం ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ ముడావత్ జామ్లా తెలిపారు. సోమవారం ఆయన బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల పరిధిలోని ఖాతాదారులు ఈ నెల 27వ తేదీలోపు బ్యాంకింగ్ అవసరాల ను పూర్తి చేసుకోవాలన్నారు. బ్యాంకుకు సంబంధించిన ఏమైనా సందేహాలు ఉంటే వినియోగదారులు బ్యాంకులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో క్యాషియర్ ఏ.కోటేశ్వర్‌రావు, మెసెంజర్ ఎస్.రామనర్సయ్య, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్ జాతాను విజయవంతం చేయాలి

నాంపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు జరుగుతున్న ఆశావర్కర్ల బస్సు జాతను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల వైద్యురాలు డాక్టర్ భవానికి బస్సుజాతా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ రూ.18వేల వేతనాన్ని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ కవిత, కోరే లలిత, ఎదుళ్ల సునిత, విజయలక్ష్మి, సరిత, నీలిమా, అలివేలు, పద్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 108 సర్వీసు

కేతేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు ఎట్టకేలకు 108సర్వీసు అందుబాటులోకి వచ్చింది. కేతేపల్లి మండలానికి ఆపద సమయాల్లో అవసరమైన అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు ఐదారేళ్లుగా నకిరేకల్, సూర్యాపేట పట్టణాల్లోని 108 సర్వీసులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఉండేవి. మండలంలోని ఏ గ్రామంలో ఎలాంటి ఆపద వచ్చినా నకిరేకల్, సూర్యాపేట పట్టణాల నుంచి అంబులెన్స్ వచ్చే వరకూ వేచి ఉండాల్సిందే. ఈ క్రమంలో ప్రభుత్వం కేతేపల్లి మండలానికి 108 సర్వీసు అంబులెన్స్‌ను మంజూరు చేసింది. ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం అంబులెన్స్ వాహనాన్ని నకిరేకల్ ఏరియా ఆసుపత్రిలో ప్రా రంభించారు. దీంతో సోమవారం నుంచి కేతేపల్లి మండల ప్రజలకు అందుబాటులో కి వచ్చింది. మండలానికి అంబులెన్స్ సర్వీసు అందుబాటులోకి రావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనిపాకలలో వైభవంగా అయ్యప్ప పడిపూజ

చిట్యాలరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని వనిపాకల గ్రా మంలో అయ్యప్పస్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయంలో గల శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో ఆదివారం రాత్రి యెడవె ల్లి దుర్గాప్రసాద్‌శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పడిపూజ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన రమణగురుస్వామి పూజా కార్యక్రమాలు, అభిషేకాలను నిర్వహించారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మునుగోడు: విందు భోజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఆర్డీవో శ్రీదేవి

మునుగోడు, మర్రిగూడ, నార్కట్‌పల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని డీసీసీబీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని సోమవారం మునుగోడులో క్రైస్తవులకు నిర్వహించిన విందు భోజన కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలోని షీలోగు చర్చిలో క్రైస్తవ సోదరులకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రేమ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మున్నయ్య, డీటీ తారకరామన్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు ప్రేమ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ యాకుబ్, పాస్టర్లు పొలిశెట్టి ప్రకాష్, గ్యార ప్రకాష్, అబ్రహం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ చేతన పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు దేవదూతలు, శాంతాక్లాజ్ వేషధారణతో అలరించారు. విద్యార్థులతో తయారు చేసిన క్రిస్మస్ టీ అందరినీ ఆకర్షించింది. తమ వేషధారణ, ఆట పాటలతో ఆకట్టుకున్న చిన్నారులకు బహుమతులను అందజేశారు.

అనంతరం క్రీస్తు జననం, క్రిస్మస్ పర్వదినం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, నాగలక్ష్మి, మనోహర్, మంజుల, సన, కల్యాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు రేపు



కొట్టాలలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో మున్నయ్య

నల్లగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సృశుత గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో ఈ నెల 25వ తేదీన సీజనల్ అంటువ్యాధులపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సృశుత గ్రామీణ వైద్య సంఘం వ్యవస్థాపకుడు పొనుగోటి హనుమంతరావు తెలిపారు. సుశృత గ్రామీణ వైద్యుల సంఘం వార్షికోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో బొల్లేపల్లి శ్రీనివాస్ రాజు, నర్సింహారెడ్డి, బ్రహ్మచారి, నజీరుద్దీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈనెల 28, 29, 30వ తేదీల్లో జరగబోయే విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ వల్లాల మండల కన్వీనర్ చిత్తలూరి సత్యనారాయణ కోరారు. మండలంలోని వల్లాల ఆదర్శ పాఠశాలలో సోమవారం మహాసభల పోస్టర్‌ను టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. నల్లగొండలో జరగబోయే విద్య, వైజ్ఞానిక సభలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు కుక్కడపు శ్రీనివాస్, కేతేపల్లి శ్రీను, దామెర్ల కృష్ణయ్య, సంధ్య, సంగీత, అనురాధ, స్వప్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

రేవతి కుటుంబానికి న్యాయం చేయాలి

నకిరేకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి న్యాయం చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు కొమ్మనబోయిన సైదులుయాదవ్ డిమాండ్ చేశారు. నకిరేకల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవతి కుటుంబానికి ఎన్ఎస్‌యూఐ తరుపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబసభ్యులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, మహేష్, గణేష్, అనుముల శ్రీకాంత్, సింహాద్రి, బండి శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మెరికల్లా తయారుచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉషారాణి

నల్లగొండ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా మెరికల్లా తయారుచేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్‌బిన్ కే జ్యోతి, ట్రైనింగ్ కమిషనర్ ఆఫ్ హైదరాబాద్ డివిజన్ కమిషనర్ ఉషారాణి అన్నారు. కేంద్రీయ విద్యాలయంలో ఉద్యోగం సాధించిన మహిళా ఉపాధ్యాయులకు వారం రోజులు పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. విధుల నిర్వహణలో పాటించాల్సి నియమాలపై శిక్షణ ఇచ్చారు. నల్లగొండలో 131 మంది భారత స్కౌట్ విభాగంలోని మహిళా ఉపాధ్యాయులకు 12 మంది శిక్షకులతో శిక్షణ ఇచ్చినట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిషనర్ వహిదా, హైదరాబాద్ ప్రాంతం అసిస్టెంట్ కమిషనర్ అనురాధ పాల్గొన్నారు.

గ్రామాల్లో పాడిపశువుల పెంపకానికి ప్రోత్సాహం

● డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి



తాళ్లవెల్లంలలో పాడి రైతులతో మాట్లాడుతున్న పీడీ శేఖర్‌రెడ్డి

చిట్యాలరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పశువుల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామంలో సోమవారం పశువుల పంపిణీ కార్యక్రమానికి పీడీ హాజరై పశువుల పెంపకం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి రోజుల్లో ఇంటింటికీ గేదెలు, ఆవులు ఉండేవని, దీంతో రైతులకు లాభదాయకంగా ఉండేదన్నారు. ప్రస్తుతం పశువుల పెంపకంపై రైతులు ఆసక్తిని కనబరచకపోవడం బాధాకరమన్నారు. ఐకేపీ పథకంలో భాగంగా మండలంలో 26 గేదెలను పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, 13 పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో గేదెకు రూ.1లక్ష బీమా సౌకర్యంతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మ, ఏపీవో శ్రీలత, ఎంపీవో సత్యనారాయణ, సంఘ బంధం అధ్యక్షురాలు, సీసీలు, వీవోఏ, ఎఫ్‌ఏ రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

కట్టంగూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య అన్నారు. కట్టంగూరులో సోమవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూకల శ్రీధర్‌రెడ్డి, బూరుగు తిరుమలేష్, గద్దపాటి వెంకటేశ్వర్లు, అంతటి రాములు, శ్రీపాద నందకుమార్, రామకృష్ణ, సత్తయ్య, యాదయ్య పాల్గొన్నారు.

శివలీలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు

కనగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డికి తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందజేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును అందజేస్తారు. సేవారంగంలో విశిష్ట సేవలందిస్తున్న శివలీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

(5వపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అటవీ అధికారులు భూహక్కులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. 50 ఏళ్లుగా సాగులో ఉన్నా అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా దేవరకొండ నియోజకవర్గంలోని గిరిజనతండాలు, గ్రామాల్లో నెలకొన్న అటవీ, రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మా భూమిపై మాకు హక్కులు కల్పించాలి


మేము 40సంవత్సరాల నుంచి ఐదు ఎకరాలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. భూమి సేద్యం చేస్తున్నా నాలుగు సంవత్సరాల నుంచి ధరణి కారణంగా భూమి ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు మాకు అందడం లేదు. దయచేసి మా భూములు ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నాం

● కనుకటి కోటయ్య, రైతు కంబాలపల్లి

భూమి పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించాలి

సాగర్ ముంపు వాసులకు పునరావాసంలో భాగంగా అప్పటి ప్రభుత్వం ప్రతి కుటుం బానికీ ఐదు ఎకరాల భూమి కేటాయించి పా స్‌బుక్‌లు ఇచ్చింది. ధరణి కారణం గా మా భూములు మొత్తం ఆన్‌లైన్ కాలేదు. దీంతో రైతుబంధు, రైతు బీమా, బ్యాంక్ రుణాలు పొందలే క పో తున్నాం. మా భూములపై హక్కులు తిరిగి పొందే విధంగా సహకరించాలి.

● బద్దెల సత్యనారాయణ, రైతు కంబాలపల్లి



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 | కనిష్ఠం 20.0

అవగాహనే అస్త్రం

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం

మిర్యాలగూడకు చెందిన ఓ వినియోగదారుడు ఒక ప్రముఖ కంపెనీ నుంచి ఎక్స్‌కవేటర్‌ను కొనుగోలు చేశాడు. దాన్ని కొనుగోలు చేసిన నాలుగు నెలలకే సదరు వాహనం మరమ్మతులకు గురైంది. సాధారణ మరమ్మతుగా భావించి కంపెనీ షోరూమ్‌కు తీసుకెళ్లాడు. దానికి మరమ్మతులు నిర్వహించినా, తరచూ అదే సమస్య తలెత్తుతుండడంతో తయారీలోపాన్ని గుర్తించాడు. సదరు కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2018లో ఫిర్యాదు చేయగా,ఆ ఫిర్యాదు సబబైనదిగా నిర్ధారించిన కమిషన్ అతడికి రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని 2019లో సదరు కంపెనీని ఆదేశించింది. అయితే సదరు కంపెనీ రాష్ట్ర కమిషన్‌లో అప్పీల్ చేయగా, తాజాగా రెండుమాసాల క్రితం రాష్ట్ర కమిషన్ సైతం జిల్లా కమిషన్ తీర్పునే అమలుచేయాలని, బాధితుడికి రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని సూచించింది.



- నాణ్యమైన వస్తువులు, సేవలు పొందడం వినియోగదారుల హక్కు
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు, వర్చువల్‌గా విచారణకూ అవకాశం
- వినియోగదారుడి ప్రాంతంలోనే ఫిర్యాదుకు వెసలుబాటు
- నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం

మనం నిత్యం ఏదైనా ఒక వస్తువును కొనుగోలు చేయడమో లేదా ఏదైనా సంస్థ నుంచి సేవలు పొందడమో చేస్తుంటాం. అయితే ఆ వస్తువు నాణ్యతలో గానీ, సేవల్లో లోపాలు గానీ ఉంటే వినియోగదారుడు నష్టపోకుండా ప్రభుత్వం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం-2019ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టంపై అంతగా అవగాహన లేక వినియోగిస్తున్న వినియోగదారులు కొందరే. ఇప్పటికైనా అవగాహన పెంపొందించుకుంటే నాణ్యమైన సరుకులు, లోపాల్లేని సేవలు పొందడమేగాక, జరిగిన నష్టానికి పరిహారం కూడా పొందవచ్చు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



- వివరాలు 7వ పేజీలో...

వినియోగదారుడు ఉండే ప్రాంతంలో ఫిర్యాదు చేయవచ్చు



వినియోగదారులు 2019కి ముందు ఏదైనా ఫిర్యాదు చేయాలంటే సంబంధిత వస్తువు ఉత్పత్తి చేసిన కంపెనీ ఎక్కడ రిజిస్టర్ అయితే ఆ జిల్లా పరిధిలోని కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉండేది. వినియోగదారుల సౌలభ్యం కోసం 2019 చట్టంలో ఈ నిబంధనను మార్చి, వినియోగదారులు ఏ కమిషన్ పరిధిలోకి వస్తే అక్కడే ఫిర్యాదు చేసేలా మార్పు చేశారు. దీంతో నష్టపోయిన వినియోగదారులు ఎలాంటి ప్రయాస లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. దైనందిన జీవితంలో వినియోగదారుడు ఎలాంటి నష్టానికి గురైనా, లేదా సరైన సేవలు పొందలేకపోయినా, అందుకు సంబంధిత ఉత్పత్తిదారులు, సర్వీస్ ప్రొవైడర్ల నుంచి పరిహారం పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదు చేయవచ్చు. విచారణకు సైతం వర్చువల్‌గానే హాజరై ఫిర్యాదులు, పత్రాలు సమర్పించవచ్చు. మారిన వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వారి హక్కుల పరిరక్షణకు కమిషన్లు స్పందిస్తాయి.

- వి.అపర్ణరెడ్డి, న్యాయవాది

రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత ప్రకటించిన రుణమాఫీ నిధులు ఇంకా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రుణమాఫీ కోసం రైతులు నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకా మాఫీ సొత్తు రాలేదని బ్యాంకర్లు సమాధానమిస్తుండటంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మోత్కూరు, నల్లగొండ)



నాలుగో విడత రుణమాఫీ ఏదీ?

- ప్రకటనలకే పరిమితం
- బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో 48,196 మంది అర్హులు
- మాఫీ కావాల్సిన మొత్తం రూ.508.47కోట్లు

పట్టాదారు రైతు పేరు, ఆధార్ నంబర్‌లో తప్పుగా ఉండటం, రేషన్‌కార్డు లేకపోవడం, ఒకే ఆధార్ నంబర్ ఇద్దరి పేరున ఉండటం లాంటి కారణాలతో పలువురు రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ నిలిచిపోయింది. అయితే వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు సదస్సులు నిర్వహించి, తప్పులు సవరించడంతో పాటు ఏఈవోలు రైతు కుటుంబాల ఫొటోలు తీసి ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారందరికీ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్టు గత నెల 29వ తేదీన ప్రకటించింది. రుణమాఫీ పొందనున్న అర్హులైన రైతుల జాబితాలను వ్యవసాయశాఖ కూడా విడుదల చేసింది. అందులోనూ కొందరి అర్హుల పేర్లు లేవు. ఇదిలా ఉంటే ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించి 25 రోజులు అవుతున్నా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ప్రస్తుతం యాసంగి వరినాట్ల సీజన్ ముమ్మరమైంది. దీంతో రైతులు దున్నకాలు, ఎరువులు వేయడం, నాట్లలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వారికి పెట్టుబడులకు డబ్బు అవసరం. ప్రభుత్వం రుణమాఫీ నిధులు జమ చేస్తే బ్యాంకు అప్పు తీరుతుంది. దీంతో రైతులు తిరిగి మళ్లీ రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. రైతులు భూ విస్తీర్ణాన్ని బట్టి ఎక్కువ రుణం కూడా తీసుకోవచ్చు. ప్రభుత్వ మాఫీతో అప్పు తీరితే కొత్తగా రుణం తీసుకుని వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించవచ్చని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గ్రామాల నుంచి రైతులు ప్రతి రోజూ మండల కేంద్రాల్లో ఉన్న బ్యాంకులకు వెళ్లి రుణ మాఫీ నిధులు జమ అయ్యాయా? అని సిబ్బందిని ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నిధులు జమ చేయకపోవడం, రైతులు పదేపదే వచ్చి అడుగుతుండటంతో బ్యాంకు సిబ్బంది విసుక్కుంటున్నారు.

తప్పులు సవరించినా

ఉమ్మడి జిల్లాలో మూడు విడతల్లో రుణమాఫీకి నోచుకోని రైతుల తప్పులను వ్యవసాయశాఖ అధికారులు సవరించి

- మిగతా 6వ పేజీలో...

నాలుగో విడత రుణమాఫీ కాలేదు



నాకు అడ్డగూడూరు ఏపీజీవీబీలో రూ.52,900 పంట రుణం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో ప్రకటించిన రూ.లక్ష లోపు రుణమాఫీలో నాకు మాఫీ కాలేదు. దీంతో బ్యాంకుకు వెళ్లి విచారించగా నా ఆధార్ నంబర్ మరో రైతుకు రాశారు. దాన్ని సరిచేయించా. అయినా మూడు, నాలుగో విడతలోనూ నాకు రుణమాఫీ రాలేదు. మా గ్రామంలో ఆదాయం పన్ను చెల్లింపుదారులకు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా మాఫీ వచ్చింది. వ్యవసాయం చేసుకునే నాకు రాకపోవడం విచిత్రంగా ఉంది. ప్రభుత్వం నాకు రుణమాఫీ వర్తింపజేయాలి.

- నీలగిరి శ్రీనివాసులు, రైతు, లక్ష్మీదేవికాల్వ

ఇంకా మాఫీ కాలేదు

ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించినా నేటికీ మాఫీ కాలేదు. ప్రభుత్వం ప్రకటించి 25రోజులు దాటగా, రోజూ బ్యాంకు వద్దకు వెళ్లడం, వారు జమ కాలేదని చెప్పడం పరిపాటిగా మారింది. రుణ మాఫీ ఆలస్యం అవుతుండడంతో కొత్త రుణాలు తీసుకోలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రుణమాఫీ నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.

- ఎస్‌కే.ఉస్మాన్, కాశివారి గూడెం,తిప్పర్తి మండలం



ఉమ్మడి జిల్లాలో 48,196 మంది

యాదాద్రి జిల్లాలో నాలుగో విడత 11,691 మంది రైతులకు రూ.111.65కోట్లు, నల్లగొండ జిల్లాలో 21,495 మంది రైతులకు రూ.236.85 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 15,010 మంది రైతులకు రూ.159.97కోట్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో మొత్తం 48,196 మంది రైతులకు రూ.508.47కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉంది. ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించి 25 రోజులైనా నేటికీ రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు. గత మూడు విడతల్లో యాదాద్రి జిల్లాలో 68,584 మంది రైతులకు రూ.553.82కోట్లు, సూర్యాపేట జిల్లాలో 1,12,259 మంది రైతులకు రూ.845.05కోట్లు, నల్లగొండ జిల్లాలో 2,12,486 మంది రైతులకు రూ.1,767.98 కోట్ల రుణమాఫీ జరిగింది. నల్లగొండ జిల్లాలో మొదటి విడతలో 1,05,197మంది రైతులకు రూ.579.14కోట్లు, రెండో విడతలో 63,014 మంది రైతులకు రూ.632.92కోట్లు, మూడో విడతలో 44,275మందికి రూ.555.92కోట్లు రుణమాఫీ జరిగింది. అయితే వెంటనే నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

● క్రిస్మస్‌కు ముస్తాబు



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో విద్యుత్ దీపాల వెలుగులో తెలుగుబాప్టిస్ట్ చర్చి

జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలకంరించారు. క్రిస్మస్ ట్రీ, స్టార్ గుర్తులు ఏర్పాటుచేశారు. ఏసు రాక సందర్భంగా మంగళవారం ఉదయం నుంచే చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి కేక్ కట్‌చేసి ఏసు బోధనలను చర్చి ఫాదర్లు ప్రవచించనున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

7

వరి సాగు తీరు మారే

- యాంత్రీకరణపై రైతుల ఆసక్తి
- అందుబాటులోకి పలు యంత్రాలు
- సమగ్ర యాజమాన్యంపై దృష్టి
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

6



ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



అదనపు కలెక్టర్ శ్రీనివా‌స్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పలు ఇబ్బందులకు గురిచేస్తోందని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆరోపించారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై ఇంత వరకు ప్రధాని మోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రజల మనోభావాలను కించపరిచేలా వ్యవహరించిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే దేశంలో పాలన నడుస్తోందని, ఆయన రాజ్యాంగ రచనతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేడ్కర్ కృషి చేశాడన్నారు. ఆయన ఏ ఒక్క జాతికో, కులానికో నాయకుడు కాదని, అందరి వాడన్నారు. అటువంటి వ్యక్తిపై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం సంపత్‌రెడ్డి, కత్తుల కోటి, ఎండీ.ముంతాజ్, దుబ్బ అశోక్ సుందర్, జూలకంటి శ్రీనివాస్, కిన్నెర అంజి, వెంకన్న, జూలకంటి సైదిరెడ్డి, బోడ స్వామి, వజ్జ రమేష్, నాగరాజు, పి.రమేష్, కార్తీక్, ఆనంద్‌రెడ్డి, అంజయ్య, మహేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

నాంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా, కార్మికులకు, కర్షకులకు నిరంతరంగా అండగా ఉంటూ వారి కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రగిపని అంజాచారి, సుందనబోయిన రమేష్, ఊరుపక్క వెంకటయ్య, నేతాళ్ల రాజు, పల్లె సైదులు, కోరే సత్తయ్య, పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ బాలమాయాదేవి

నల్లగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, బీసీ వెల్ఫేర్ కమిషనర్ బి. బాలమాయాదేవి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి సోమవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై నిర్వహించే సమావేశాలన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. ఫొటో ఓటరు గుర్తింపుకార్డు చాల ముఖ్యమని, కార్డు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ తుది ఓటరు జాబితా తయారీలో భాగంగా పోలింగ్ కేంద్రం వారీగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో తొలగింపులు, చేర్పులు, మార్పులపై పరిశీలన చేస్తున్నామన్నారు. ముసాయిదా ఓటర్ జాబితా ప్రకారం జిల్లాలో 7లక్షల40వేల971మంది పురుష ఓటర్లు, 7లక్షల61వేల105మంది మహిళా ఓటర్లు, 127మంది ట్రాన్స్‌జెండర్లు, మొత్తం 15లక్షల2వేల203మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌వో అమరేందర్, ఆర్డీవో రమణారెడ్డి, అశోక్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ బాలమాయాదేవి, చిత్రంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి

హాస్టళ్లలో మెనూ తప్పకుండా పాటించాలి

బీసీ సంక్షేమ హాస్టళ్లల్లో తప్పకుండా మెనూ అమలు చేయాలని వసతి గృహాలను శుభ్రంగా ఉంచాలని బి. బాలమాయాదేవి ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని పలు వసతి గృహాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి కోర్సుల వివరాలను భోజనం ఎలా వండుతున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఖాజా నజీం ఆలీ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలి: కలెక్టర్

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించకుండా చూసుకోవాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. నవజాత శిశు కేసులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నీలోఫర్‌కు పంపించే సమయంలో ఆలస్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ పాల్గొన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

'భూభారతి' చట్ట రూపకర్త సునీల్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



చందంపేట మండలం కంభాలపల్లిలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, పాల్గొన్న సునీల్ తదితరులు

చందంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని భూ సమస్యలన్నింటినీ భూ భారతి చట్టం 2024 ద్వారా పరిష్కరిస్తామని భూ భారతి చట్ట రూపకర్త సునీల్, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలం కంభాలపల్లిలో రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని భూభారతి చట్టం 2024 రైతులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. చందంపేట మండలంలోని పొగిళ్ల, కంభాలపల్లి, రేకులగడ్డ తదితర గ్రామాలలోని పోడు భూములు, అటవీశాఖ అధికారుల ఆధీనంలో ఉన్న భూములన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు.

భూ భారతి చట్టం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు భూఆధార్ నెంబర్‌ను కేటాయిస్తామని, రాష్ట్రంలోని కోటి 52లక్షల ఎకరాలకు సంబంధించిన భూ వివరాలను భద్రపరిచి, ప్రతి భూ యజమాని హక్కులు కాపాడడమే భూ భారతి చట్టం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చిరెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్యలతో 50 ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్నాం

50 ఏళ్లుగా భూములను సాగుచేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, భూపత్రాలు ఇవ్వకుండా అటవీ, రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని కంభాలపల్లి, పొగిళ్ల గ్రామాలకు చెందిన రైతులు కనకటి కోటయ్య, బద్దెల సత్యనారాయణ, చిరబోయిన వెంకటయ్య ఆవేదన

- మిగతా 8వ పేజీలో...

శాంతి, సహనమే ఏసుమార్గం



మిర్యాలగూడ: ప్రార్థనలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యే బీఎల్ఆర్, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు



దేవరకొండలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, వేదికపై మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ గిరిబాబు

● ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్

మిర్యాలగూడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శాంతి, సహనమే ఏసు మార్గమని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో సోమవారం సెమీ క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన వేడుకల్లో వారు పాల్గొని పాల్గొన్నారు. పరిశుద్ధ ఆత్మ అగ్ని మినిస్ట్రీస్ వారి విడుదల ఉజ్జీవం గ్రాండ్ సెమీక్రిస్మస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని క్రీస్తును ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, పాస్టర్స్ స్టీఫెన్ హనోక్, విల్సన్, కిరణ్‌కుమార్, ఇమ్మాన్యుయేల్, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవరకొండ: క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమతాలకు సమానమైన సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ విధానమని అన్నారు. నిరుపేద క్రిస్టియన్లకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని అన్నారు. క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సవాలతో నిర్వహిం చుకోవాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్‌ను క్రిస్టియన్ పెద్దలు, పాస్టర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, సీఐ నర్సింహులు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో డానియెల్, పాస్టర్లు ప్రభు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని న్యూ కిడ్స్ పబ్లిక్ స్కూల్‌లో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతాక్లాజ్, దేవదూతల వేషధారణలో ఆకట్టుకున్నారు. శాంతక్లాజ్ వేషధారణలో ఉన్న విద్యార్థితో కేక్ కట్ చేయించి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. అనంతరం విద్యార్థులు ఏసు జననం గురించి నృత్యాల రూపంలో చేసి చూపించారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహ, ఉపాధ్యాయులు నాగరాజు, మంగాదేవి, హుస్సేన్‌బీ, స్నేహలత, మల్లిక, హసీనా, రాము, ఈదయ్య, పుష్పవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

దేవరకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపోలో ఈ నెల 24న మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను, సూచనలను సెల్. 9959226311 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

● మిర్యాలగూడటౌన్: మిర్యాలగూడ పట్టణంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్యలో సెల్: 9959226308 నెంబరు కాల్ చేసి సమస్యలు వెల్లడించాలని కోరారు.

రేపు, ఎల్లుండి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చింతపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, బాక్సింగ్ డే పురస్కరించుకొని సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఈ నెల 25, 26 తేదీల్లో కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి వేణుకుమార్ సోమవారం తెలిపారు. తిరిగి 27 నుంచి కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సాధారణ ప్రసవాల సంఖ్య మెరుగుపర్చడమే లక్ష్యం

గీతావాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల రేటును మరింతగా మెరుగుపరిచే లక్ష్యంతో వైద్యబృందం సమష్టిగా పనిచేస్తోంది. డివిజన్ పరిధిలో ప్రతి పీహెచ్‌సీలోనూ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు జాగ్రత్తలను వివరిస్తున్నాం.

- (మిర్యాలగూడ అర్బన్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల సంఖ్య ఏ స్థాయిలో ఉంది?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: మిర్యాలగూడ డివిజన్ పరిధిలో 10 పీహెచ్‌సీలు, 2 అర్బన్ హెల్త్‌సెంటర్లు, మరో రెండు బస్తీ దవాఖానాలు పనిచేస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 4599 సాధారణ ప్రసవాలు నమోదైతే ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2407, పీహెచ్‌సీల్లో 2192 ప్రసవాలు నమోదయ్యాయి. వచ్చే ఏడాది మరింత రెట్టింపు స్థాయిలో ప్రసవాల సంఖ్య నమోదు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: క్షేత్రస్థాయి వైద్యసేవలు ఎలా ఉన్నాయి?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: పీహెచ్‌సీల పరిధిలో నాణ్యమైన వైద్యసేవలందించి ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేందుకు వారాంతపు ప్రణాళికను అమలు చేస్తున్నాం. ఏఎన్ఎం, ఆశాలు తమ పరిధిలో రికార్డు చేసిన గర్భిణులకు ప్రతీ సోమవారం ప్రత్యేకవైద్యపరీక్ష, మంగళ, శుక్రవారాల్లో ఆరోగ్యమహిళా కార్యక్రమం, గురువారం - వయోవృద్ధులకు ఆరోగ్యపరీక్ష, స్కూల్ విజిట్, బుధవారం - చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాల పంపిణీ, శనివారం - ఆవాసగ్రామాల్లో వ్యాధినిరోధక టీకాల పంపిణీతో పాటు ఈ- సంజీవని, టెల్లిమానస్ కార్యక్రమాలతో ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలను చేరువచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: 24 గంటల వైద్యసేవలు సంపూర్ణంగా అందిస్తున్నారా..?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: డివిజన్ పరిధిలో దామరచర్ల, వేములపల్లి, పెద్దవూర, నిడమనూరు, హాలియా పీహెచ్‌సీల్లో 24గంటల వైద్యసేవలు అమలవుతున్నాయి. ప్రతి ఆస్పత్రిలో రాత్రివేళలో స్టాఫ్‌నర్సు డ్యూటీలో ఉండేలా చర్యలు తీసుకున్నాం. అత్యవసర సమయాల్లో డాక్టర్ కూడా అందుబాటులో ఉండాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నాం. డివిజన్ పరిధిలో కొన్ని ఆస్పత్రుల్లో కొంతమేర సిబ్బంది కొరత ఉన్నది. త్వరలో జరిగే ఉద్యోగ భర్తీతో ఆ లోటుకూడా తీరనున్నది.

ఆంధ్రజ్యోతి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తున్నారు?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: ప్రతీ సీజన్‌లో ప్రజలు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలి. ప్రధానంగా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ రోగాల నుంచి బయటపడవచ్చు. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగాలి. మాంసాహారం కంటే శాఖాహారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి. చలికాలంలో డైట్ కంట్రోల్ పాటించడం చాలా మంచిది.

దాతలకు అవగాహన కల్పించాలి: డీఎస్పీ



డీఎస్పీ గిరిబాబుకు మొక్కను బహుకరిస్తున్న ఎస్ఐ నర్సింహులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా దాతలకు అవగాహన కల్పించాలని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అన్నారు. సోమవారం ఉమ్మడి మండలంలోని గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా డీఎస్పీకి ఎస్ఐ నర్సింహులు ఘనంగా స్వాగతం పలికి గౌరవ వందనం చేశారు.వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను డీఎస్పీ పరిశీలించారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, నైట్ పెట్రోలింగ్ వంటి అంశాల గురించి ఆరా తీశారు.. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్ఐతో డీఎస్పీ చర్చించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
● ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



మిర్యాలగూడ పట్టణంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ అధికారులు సిబ్బంది, పోలీస్‌లు, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ట్రాఫిక్ నియంత్రణపై టౌన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సాగర్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ డాక్టర్స్ కాలనీ, ప్రధాన వీధుల గుండా సాగింది. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వాహనదారులకు పార్కింగ్, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్‌పై పలు సూచనలు చేశారు. దుకాణాల సముదాయాల ముందు క్రమపద్ధతితో వాహనాలను నిలిపివుంచే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన వీధి సాగర్‌రోడ్డులో కార్పొరేట్ వ్యాపార సంస్థలు నెలకొల్పుతూ వుండటం వల్ల వ్యాపార వ్యక్తిగత పనులపై వచ్చివెళ్లే వారి సంఖ్య పెరుగుతోందని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల సమస్య మిరంత జటిలమౌతోందని అన్నారు. రోడ్డుపైనే వాహనాలు నిలిపివుంచడం వల్ల నిత్యం రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రజలు, వాహనదారులు, వీధివ్యాపారస్థులు, షోరూంలవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్లపై రద్దీ నియంత్రణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసూఫ్, సీఐలు నాగార్జున, కరుణాకర్, ఎస్ఐలు రాంబాబు, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకూరి బాలు, జలంధర్ రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, ఎండి.జాని, రామకృష్ణ పాల్గొన్నారు..

క్రికెట్ పోటీల్లో విజేత దేవరకొండ జట్టు



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 12రోజులనుంచి కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ఉత్కంఠగా ముగిశాయి. దేవరకొండ జట్టు ప్రథమ స్థానం, అంగడిపేట జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల కాంగ్రెస్ నాయకులు వంగాల వెంకట్‌రెడ్డి, వీరమళ్ల పరమేష, బోల్లు గోవింద్, వడ్లపల్లి శేఖర్‌రెడ్డి, పాస్టర్ మత్తయ్య హాజరై విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌ను బహుకరించారు. విన్నర్ జట్టుకు దాత వడ్లపల్లి శేఖర్‌రెడ్డి రూ.25వేలు, షీల్డ్ బహుకరించగా, రన్నర్ జట్టుకు కాంగ్రెస్ నాయకుడు బొల్లు గోవింద్ రూ.20 వేలు, షీల్డ్‌ను అందించారు. మూడవ బహుమతి వీరమళ్ల పరమేష రూ.15వేలుతో పాటు షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ శ్రీనునాయక్, సపావత్ లోకేష్, బాబురెడ్డి, చిరంజీవి, రాగ్యనాయక్ సన్నీ, శ్రీకాంత్, ప్రశాంత్, సంజయ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే బాలునాయక్



చింతపల్లిలో 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరైన 108 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఆరోగ్య వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటి చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మండల వైద్యాధికారి శ్రీదేవి, శ్రీనివాస్‌యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రా రాంసింగ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, వెంకట నరసింహరెడ్డి, రియాజ్ పాష, కాయితి జితేందర్ రెడ్డి, గుండ్లపల్లి నరసింహరెడ్డి, పురుషోత్తం రెడ్డి, కోశాధికారి కొండల్ యాదవ్, శేఖర్, కట్ట మహేష్, దాసరి రాజు పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. అనాథలకు చేయూతనందించడంతో పాటు విద్య, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న హన్యానాయక్‌ను ఇంటర్నేషనల్ ఎస్ఎంఈ బిజ్ సంస్థ అంతర్జాతీయ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేయగా, సోమవారం న్యూఢిల్లీలోని జేపీ సిద్దార్థ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో హన్యానాయక్‌కు అవార్డును సంస్థ ప్రతినిధులు అందజేశారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మిర్యాలగూడలో విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఏళ్ల తరబడి విడుదల చేయనందున విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకువెళ్లాలని విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు పెడుతున్నాయని, కొన్ని యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో రమేష్, టిల్లు, వీటి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

డిండి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు 100 రకాల ఆహార పదార్థాలను సేకరించి ప్రదర్శించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడా నికి ఈ ఫెస్టివల్ నిర్వహించినట్లు హెచ్ఎం రాజేందర్‌రెడ్డి తెలిపారు. జంక్ ఫుడ్ కూడ ఫెస్టివల్‌లో ఉంచి జంక్ ఫుడ్ తినొద్దని, ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆహార నియమాలు పాటించాలని ఎంఈవో గోప్యానాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు బాలరాజు, వెంకటేష్, వెంకటయ్య, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలుచేయాలి



నిడమనూరులో బస్సు జాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిడమనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేలు కనీసవేతనం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీసవేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న బస్సు జాతకు సంబంధించిన పోస్టర్లను సోమవారం నిడమనూరులోని పీహెచ్‌సీ ఎదుట ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆశాలకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 19 ఏళ్లుగా పని చేస్తూ చాలీచాలని వేతనాలతో ఆశా వర్కర్లు జీవితాన్ని నెట్టుకొస్తున్నారని వాపోయారు. ఈనెల 31 వరకు నిర్వమించనున్న బస్సు జాతను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూమండల కన్వీనర్ కొమాండ్ల గుర్వయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు బొరెడ్డి అనూష, బాలనారాయణ, మమత, మహేశ్వరి, షాహిన్, సునిత, జ్యోతి పాల్గొన్నారు.

బస్సు జాతను విజయవంతం చేయాలి

నాంపల్లి (ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆశావర్కర్ల బస్సు జాతను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల వైద్యురాలు డాక్టర్ భవానికి బస్సుజాతా పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాలలో ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ రూ.18వేల వేతనాన్ని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ కవిత, కోరే లలిత, ఎదుళ్ల సునీత, విజయలక్ష్మి, సరిత, నీలిమా, అలివేలు, పద్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రతిభ అమోఘం: కలెక్టర్ త్రిపాఠి

చింతపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కాల గ్రామానికి చెందిన తిగుళ్ల శ్రావణి శివల సంవత్సరం వయసు ఉన్నా కుమార్తె ధన్విత తొమ్మిది సెట్స్ ఫ్లాష్ కార్డును గుర్తించి ప్రతిభ చాటింది. చిన్నారి గుర్తించిన సమాచారాన్ని తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో వివరాలు నోబెల్ కన్‌సీడర్స్‌కి అందించారు. ధన్వితకు కలెక్టర్ త్రిపాఠీ సోమవారం నోబెల్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారి ధన్విత తొమ్మిది సెట్స్ ఫ్లాష్ కార్డులను గుర్తించి రంగులను కలుపడం ఆమోఘమన్నారు. తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వింజమూరి రవి, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లు, ఐడీ కార్డుల పంపిణీ

పెద్దవూర, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొల్తీతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను, స్పోర్ట్స్ దుస్తులను గ్రామానికి చెందిన పొల్తి శంకర్, పొల్తీ రమేష్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో తరి రాము దాతలను అభినందించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల తనిఖీ

కొండమల్లేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీసీఐ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలను సోమవారం జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసే క్రమంలో తేమ, తూకం తదితర అంశాలలో సిబ్బంది పాటిస్తున్న నిబంధనల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు ఇచ్చే తక్ పట్టీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడివో ఇందిరా, ఏఈఈ రాఘవేందర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మాడ్గులపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్రవానిగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి బుచ్చయ్యకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి లబ్ధిదారునికి అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుండెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

60 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

చింతపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజమూర్ తండాల్లో ఎక్సైజ్ సీఐ సైదులు ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 60 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధ్యుడిపై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రచారానికే పరిమితమైన ప్రభుత్వం

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనంటూ రాష్ట్రప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి ఆరోపి ంచారు. పట్టణంలోని 35వ వార్డు గాంధీనగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం కాగా ఆ కుటుంబానికి రూ. 20వేల అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఏ వర్గానికి న్యాయం .రగడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, శివకుమార్, వేణు, రాజిరెడ్డి, రమేష్, సంధ్య, ఝాన్సీ సైదులు పాల్గొన్నారు.

బీజేపీ ధర్మాపురం బూత్ కమిటీ ఎన్నిక

మాడ్గులపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురం గ్రామ 244, 245 బీజేపీ నూతన బూత్ కమిటీ అధ్యక్షులుగా కొండేటి వెంకన్న, మొగుళ్ల శివలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ ఎన్నికైన వారికి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మొగుళ్ల జానకీరాములు, మండల ప్రధాన కార్యదర్శి ఇటికాల జాన్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, పార్వతమ్మ, రమ్య, శివ, రాకేష్, రమేష్, సైదులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

(5వపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అటవీ అధికారులు భూహక్కులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్‌పుస్తకాలు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. 50 ఏళ్లుగా సాగులో ఉన్నా అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా దేవరకొండ నియోజకవర్గంలోని గిరిజనతండాలు, గ్రామాల్లో నెలకొన్న అటవీ, రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మా భూమిపై మాకు హక్కులు కల్పించాలి

మేము 40సంవత్సరాల నుంచి ఐదు ఎకరాలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. భూమి సేద్యం చేస్తున్నా నాలుగు సంవత్సరాల నుంచి ధరణి కారణంగా భూమి ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు మాకు అందడం లేదు. దయచేసి మా భూములు ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నాం

-కనుకటి కోటయ్య, రైతు కంబాలపల్లి

భూమి పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించాలి

నాగార్జునసాగర్ ముంపు ప్రాంతంలో మేము పునరావాసంలో భాగంగా అప్పటి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ ఐదు ఎకరాల భూమి కేటాయించి పాస్‌బుక్‌లు ఇచ్చింది. ధరణి కారణంగా మా భూములు మొత్తం ఆన్‌లైన్‌లో లేని కారణంగా రైతుబంధు, రైతు బీమా, బ్యాంక్ రుణాలు పొందలేక పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా భూములపై హక్కులు తిరిగి పొందే విధంగా సహకరించాలి.

-బద్దెల సత్యనారాయణ, రైతు కంబాలపల్లి